


TGTEL/25/A1713

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను


సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక :221 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | సోమవారం 27 జూలై 2026 | వెల : 4/-

## విద్యార్థుల డిమాండ్ న్యాయమైనదే

- 'విద్యార్థులపై జరిగిన క్రూరమైన దాడికి బాధ్యులెవరుల'
- అమిత్ షాకు రాహుల్ గాంధీ లేఖ
- జులై 20న నిరసనల్లో విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యపై కేంద్ర హోంమంత్రికి రాహుల్ గాంధీ లేఖ
- పెల్లెట్ గన్స్ వినియోగానికి అనుమతి ఇచ్చింది ఎవరో వెల్లడించాలని డిమాండ్

## ఉత్తర తెలంగాణ అభివృద్ధికి

# గేమ్‌చేంజర్

- ఆదిలాబాద్ విమానాశ్రయానికి రూ.2వేల కోట్లు మంజూరు
- ఆదిలాబాద్‌లో ప్రతిష్ఠాత్మక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటు
- రూ.2,278.14 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు
- ప్రాజెక్టు కోసం మొత్తం 2,009.23 ఎకరాల భూమిని సేకరించనున్న ప్రభుత్వం



హైదరాబాద్

ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ కల సాకారం దిశగా అడుగులు పడుతోంది. ఈ నేపథ్యంలోనే ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఈ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు రూ.2,278.14 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు కోసం మొత్తం 2,009.23 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు రూ.2,278.14 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 2,009.23 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు వెల్లడించారు. ఇందులో 1,609.23 ఎకరాలు భారత వైమానిక దళం (ఐఏఎఫ్) అవసరాల కోసం, - మిగతా3లో



## నత్తనడకన రేషన్ కార్డుల

# ఈ-కేవైసీ

- అప్రమత్తం కాకుంటే ఇబ్బందే
- 5, 8 ఏళ్ల పిల్లలకు ఈ-కేవైసీ మినహాయింపు
- వేలిముద్రలు లేని వారు బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచన
- ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు సమీప రేషన్ దుకాణాల్లో పూర్తిచేయాలి

హైదరాబాద్

రేషన్ కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ప్రతి యూనిట్ లబ్ధిదారుడు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని అధికారులు చెబుతున్నా, కొందరు స్పందించడం లేదు. ఈనెల చివరి వరకు గడువు ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే గత వారానికి, ప్రస్తుత పరిస్థితిలో పెద్దగా మార్పు లేదని తెలుస్తోంది. ఐదేళ్ల వయసున్న - మిగతా3లో



## కార్గిల్ వీరుల శౌర్యం దేశానికి స్ఫూర్తి

- విజయ్ దివస్ వేళ ప్రధాని మోదీ నివాళి
- కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమర జవాన్లకు రాష్ట్రపతి, ప్రధాని మోదీ ఘన నివాళి
- అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సైనికులు చూపిన పరాక్రమం దేశానికి గర్వకారణమని వ్యాఖ్య

## భారత రైల్వేలో కొత్త శకం

- విజయవంతంగా పరుగులు పెట్టిన హైడ్రోజన్ రైలు
- దేశంలో తొలి హైడ్రోజన్ రైలు ట్రయల్ రన్ విజయవంతం
- 1,200 కిలోమీటర్లు ప్రయాణించి 3,200 లీటర్ల డీజిల్ ఆదా
- పొగకు బదులుగా నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేసే టెక్నాలజీ
- ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానమని, మేధో హక్కులు భారత్‌వేనని ప్రకటన
- త్వరలోనే ఢిల్లీ మార్గంలోనూ ప్రయోగాత్మక పరుగులు




## ఎక్స్‌ప్రెస్‌లుగా ఆర్డినరీ బస్సులు



- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పల్లెవెలుగు బస్సులు ఎక్స్‌ప్రెస్‌లుగా
- అవసరం, డిమాండ్ పేరు చెబుతున్నఆర్టీసీ అధికారులు
- ఆర్డినరీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం వల్ల ఆలస్యంగా గమ్యస్థానాలకు

హైదరాబాద్

ఆర్టీసీ అధికారులు పల్లెవెలుగు బస్సులను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చేస్తున్నారు. ఆర్డినరీ బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు పెడుతున్నారు. అవసరం, డిమాండ్ పేరుతో ప్రయాణికులను ఏమార్చుతున్నారు. దీంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు - మిగతా3లో




## పాక్ చేసే ఎలాంటి దుస్సాహసానికైనా ఊహించని స్థాయిలో బదులిస్తాం

- కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ద్రాస్‌లో అమర జవాన్లకు రక్షణ మంత్రి నివాళి
- భారత్ సార్వభౌమత్వాన్ని సవాలు చేసే ప్రతి చర్యకు కఠిన ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరిక
- కార్గిల్ యుద్ధం కేవలం సైనిక, దౌత్య విజయం మాత్రమే కాదు
- భారత జవాన్ల అజేయ సాహసం, అసాధారణ వీరత్వాన్ని ప్రపంచం మొత్తం చూసిన చారిత్రక ఘట్టం

## ఫారాలు తిరిగిస్తేనే

# ఓటు

- 'సర్' ఎన్యూమరేషన్ ఫారం తిరిగివ్వకుంటే ఓటు పోయినట్లే!
- ఎన్యూమరేషన్ పత్రాల సేకరణకు బీఎల్‌వోల అవస్థలు
- జోరందుకున్న సర్ డిజిటలైజేషన్ ప్రక్రియ
- ఎన్యూమరేషన్ పత్రాల సేకరణకు ఒక్కో ఇంటికి మూడుసార్లు వెళుతున్న బీఎల్‌వోలు



హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) డిజిటలైజేషన్ ప్రక్రియ జరుగుతోంది. ఇంటింటికి పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగి సేకరించేందుకు పలుచోట్ల బీఎల్‌వోలు అవస్థలు పడుతున్నారు. బూత్‌ల వారీగా ఉన్న ఓటర్ల, ఫామ్‌లను లెక్కల్లోకి తీసుకుని అన్నింటిని డిజిటలైజ్ చేయాల్సి ఉండగా, కొన్నిచోట్ల ఓటర్ల నుంచి స్పందన కరవైంది. ఆగస్టు 3తో గడువు తేదీ ముగిస్తుండటంతో అధికార యంత్రాంగం పూర్తిగా సర్ ప్రక్రియపైనే దృష్టి పెట్టింది. రాష్ట్రంలో పలుచోట్ల బూత్‌ల వారీగా పార్టీల ప్రతినిధుల సహకారంతో బీఎల్‌వో (బూత్ లెవల్ అధికారులు) ఓటర్లకు సంబంధించిన వివరాలను డిజిటలైజ్ చేస్తున్నారు. అందుబాటులో లేని, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన, మృతిచెందిన వారి వివరాలను పొందుపర్చి, తొలగింపు జాబితాలో ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అయితే కొంతమంది ఓటర్లు - మిగతా3లో

## 114 రఫేల్ యుద్ధ విమానాల డీల్

- ఫ్రాన్స్ నుంచి క్లారిటీ వచ్చేది అప్పుడే!
- 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ప్రతిపాదన పంపిన భారత్
- ఆగస్ట్ నెల మధ్య నాటికి అధికారిక సమాధానం ఇవ్వనున్న ఫ్రాన్స్
- 94 రఫేల్ ఫైటర్ జెట్లు భారత్‌లోనే తయారయ్యే అవకాశం



# 114 రఫేల్ యుద్ధ విమానాల డీల్

భారత వాయుసేన యుద్ధ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే దిశగా తలపెట్టిన 114 రఫేల్ ఫైటర్ జెట్ల మెగా ఒప్పందంలో కీలక పరిణామం జరిగింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భారత ప్రభుత్వం ఈ ఏడాది మే నెలలో పంపిన లెటర్ ఆఫ్ రిక్వెస్ట్‌కు ఫ్రాన్స్ ప్రభుత్వం ఆగస్ట్ మధ్య నాటికి తన అధికారిక ప్రతిస్పందన తెలియజేయనుంది. రక్షణ శాఖ వర్గాల సమాచారం ప్రకారం మే నెలలో భారత్ పంపిన ప్రతిపాదనకు ఫ్రాన్స్ ఆగస్ట్ మధ్య వరకు సమయం కోరింది. ఫ్రాన్స్ నుంచి అధికారికంగా సమాధానం వచ్చాక ఇరు దేశాల మధ్య విమానాల ధర, రవాణా, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, దేశీయంగా తయారీ నిబంధనలపై ద్వైపాక్షిక చర్చలు వేగవంతం కానున్నట్లు తెలుస్తోంది.



**భారత్‌లోనే 94 రఫేల్స్ తయారీ**

ఈ ప్రాజెక్టులో అత్యంత కీలక అంశం 94 రఫేల్ విమానాల్ని భారత్‌లోనే తయారు చేయడం. ఫ్రాన్స్‌కు చెందిన డసాల్ట్ ఏవియేషన్ భారతీయ భాగస్వామ్య సంస్థతో కలిసి దేశీయంగా ఉత్పత్తి చేపట్టనుంది. మిగతా విమానాల్ని ఫ్రాన్స్ నుంచి నేరుగా సరఫరా చేస్తారు. ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఏంటంటే, ఫ్రాన్స్ వెలుపల తొలిసారి రఫేల్ యుద్ధ విమానాల తయారీ భారత్‌లోనే జరగనుంది. దీంతో 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి మరింత బలం చేకూరే అవకాశం ఉంది. ఇంకా భారత రక్షణ తయారీ రంగానికి ఇది కీలక మైలురాయిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 50 శాతం లోకలైజేషన్ (స్వదేశీకరణ) సాధించొచ్చని భావిస్తున్నారు. ఇంకా ఈ డీల్ ద్వారా భారతీయ సాంకేతికతతో తయారైన స్వదేశీ క్షిపణులు, ఆయుధ వ్యవస్థల్ని రఫేల్ విమానాల్లో సులభంగా సమీకరించే వెసులుబాటు కూడా భారత్‌కు లభిస్తుంది.

**తగ్గుతున్న స్క్వాడ్రన్ బలం- రఫేల్ అత్యవసరం!**

ప్రస్తుతం భారత వాయుసేన స్క్వాడ్రన్ బలం క్రమంగా తగ్గుతోంది. రష్యా సాంకేతికతకు చెందిన పాత మిగ్ రకం యుద్ధ విమానాల్ని దశలవారీగా సేవల నుంచి ఉపసంహరిస్తుండటం, మరోవైపు స్వదేశీ తేజాస్ మార్క్-1ఏ, తేజాస్ మార్క్- 2 విమానాల ఉత్పత్తి, సరఫరాలో జాప్యం ఎదురవుతోంది. ఇంకా ప్రస్తుతం వాయుసేనకు అవసరమైన 42.5 స్క్వాడ్రన్లకు బదులుగా కేవలం 29 స్క్వాడ్రన్లు మాత్రమే ఉండటంతో కొత్త యుద్ధ విమానాల అవసరం అత్యవసరంగా మారింది. ఈ నేపథ్యంలోనే కొత్త రఫేల్ విమానాల కొనుగోలు, భారత వాయుసేన సామర్థ్యాన్ని పెంచేందుకు కీలకంగా భావిస్తున్నారు.

2024లో రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత వాయుసేన సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా సమగ్ర అధ్యయనం నిర్వహించారు. ఆ రిపోర్ట్ ఆధారంగా రక్షణ మంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్తోంది. అలాగే డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ కూడా 4 నెలల కిందటే భారత వాయుసేన ప్రతిపాదించిన 114 రఫేల్ జెట్ల కొనుగోలు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఇప్పుడు ఫ్రాన్స్ అధికారిక స్పందన అనంతరం ఈ బిలియన్ డాలర్ల రక్షణ ఒప్పందం నెక్ట్స్ స్టేజ్‌లోకి ప్రవేశించనుంది.

**200 దాటనున్న రఫేల్ జెట్లు**

ప్రస్తుతం భారత వాయుసేన, భారత నౌకాదళం కలిసి 62 రఫేల్ విమానాలకు ఆర్డర్లు ఇచ్చాయి. తాజాగా 114 విమానాల ఒప్పందం పూర్తయితే దేశంలో రఫేల్ యుద్ధ విమానాల సంఖ్య 176 కు చేరుతుంది. అదనంగా భారత నౌకాదళం మరో 31 రఫేల్- మెరైన్ విమానాల్ని తీసుకోవాలని ఆసక్తి చూపడంతో ఇది కూడా పూర్తయితే భవిష్యత్తులో మొత్తం రఫేల్ యుద్ధ విమానాల సంఖ్య 200 దాటే అవకాశం ఉంది. ఈ 114 రఫేల్ జెట్ల కొనుగోలు డీల్ విలువ ఏకంగా రూ. 3.25 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా. ప్రస్తుతం భారత వాయుసేన దగ్గర 36 రఫేల్ యుద్ధ విమానాలు సేవల్లో ఉన్నాయి.

## భారత రైల్వేలో కొత్త శకం..




భారత రైల్వే చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి హైడ్రోజన్ రైలు తన ప్రయోగాత్మక పరుగును విజయవంతంగా పూర్తి చేసింది. 10 కోచ్‌ల ఈ రైలు 1,200 కిలోమీటర్లకు పైగా ప్రయాణించి, ఏకంగా 3,200 లీటర్ల డీజిల్ వినియోగాన్ని ఆదా చేసినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైలు ప్రయాణ సమయంలో కర్బన ఉద్గారాలకు బదులుగా కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేయడం దీని ప్రత్యేకత. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రసాయన చర్య ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటూ ఈ రైలు నడుస్తుంది. దీనివల్ల పొగ గానీ, కర్బన ఉద్గారాలు గానీ వెలువడవు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రైలు రవాణా వ్యవస్థల్లో ఇది అత్యంత పర్యావరణ హితమైనదిగా నిలుస్తోంది. ఈ రైలులో 2,400 కిలోవాట్ల మొత్తం శక్తిని అందించే రెండు హైడ్రోజన్ పవర్ కార్లు, లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీలు, హైడ్రోజన్ సిలిండర్లు ఉన్నాయి. ప్రస్తుతం జింద్ – సోనిపట్ మధ్య ఈ రైలును విజయవంతంగా నడిపారు. త్వరలోనే ఢిల్లీ మార్గంలోనూ దీని ప్రయోగాత్మక పరుగులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, ఈ రైలు సాంకేతికత పూర్తిగా స్వదేశీ అని, 'ఆత్మనిర్భర్ భారత్' దార్శనికతకు ఇది నిదర్శనమని అన్నారు. ఈ టెక్నాలజీకి సంబంధించిన మేధో సంపత్తి హక్కులను (ఫ్రా తీఅస్త్రష్ట్రం) భారత్ నిలుపుకుందని, భవిష్యత్తులో ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు మార్గం సుగమం అయిందని ఆయన వివరించారు.

# పాక్ చేసే ఎలాంటి దుస్సాహసానికైనా ఊహించని స్థాయిలో బదులిస్తాం

పాకిస్థాన్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా, అది ఊహించని స్థాయిలో భారత్ ప్రతిస్పందించే సామర్థ్యం కలిగి ఉందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. భారత సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే ప్రతి కుట్రకు ఇదే సమాధానమని హెచ్చరించారు. కార్గిల్ విజయ్ దివస్ 27వ వార్షికోత్సవం సందర్భంగా లద్ధాఖ్ ద్రాస్ సెక్టార్‌లోని యుద్ధ స్మారకం వద్ద రాజ్‌నాథ్ సింగ్ పుష్పగుచ్ఛం సమర్పించి వీర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కార్గిల్ యుద్ధ స్మారక వర్చువల్ పోర్టల్‌ను కూడా ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భారత సైనికుల ధైర్యసాహసాలను కొనియాడారు.



కార్గిల్ యుద్ధం కేవలం సైనిక, దౌత్య విజయం మాత్రమే కాదని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. భారత జవాన్ల అజేయ సాహసం, అసాధారణ వీరత్వాన్ని ప్రపంచం మొత్తం చూసిన చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు ప్రదర్శించిన పరాక్రమం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని, ప్రతి భారతీయుడు గర్వపడే విజయమని కొనియాడారు. ఇక ఇటీవల 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా దానిని గుర్తు చేసుకున్నారు. ఆ ఆపరేషన్‌లో భారత సైనికులు, అధికారులు ఉగ్రవాదులకు, వారికి మద్దతు ఇచ్చే శక్తులకు మరచిపోలేని గుణపాఠం చెప్పారని అన్నారు. భారత్‌పై ఎలాంటి దుష్ప్రయత్నం జరిగినా దానికి మరింత కఠినంగా బదులిచ్చే శక్తి దేశానికి ఉందని స్పష్టం చేశారు. భారత సార్వభౌమత్వాన్ని సవాలు చేసే ప్రతి చర్యకు ఇదే ఫలితం ఉంటుందని ఈ వేదిక నుంచే స్పష్టమైన సందేశం ఇస్తున్నానని పేర్కొన్నారు.

**దేశ ఐక్యతకు అమరులే నిదర్శనం**

కార్గిల్ యుద్ధ స్మారక స్థూపాన్ని పరిశీలిస్తే అది మొత్తం భారతదేశానికి ప్రతిబింబంగా కనిపిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. హిమాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మేఘాలయ, తమిళనాడు సహా దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన అమర జవాన్ల పేర్లు అక్కడ కనిపిస్తాయని చెప్పారు. దేవాలయాలు, మసీదులు, గురుద్వారాలు, చర్చిలకు వెళ్లే వివిధ మతాలకు చెందిన సైనికులు దేశ రక్షణ కోసం ఒకటిగా పోరాడి ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. దేశాన్ని విభజించాలని కలలు కనే వారు ఈ అమరుల పేర్లు చెక్కిన గోడను చూడాలని, అదే వారి కుట్రలకు సమాధానమని వ్యాఖ్యానించారు.

**'తగిన సమాధానం ఇచ్చేందుకు పూర్తిగా సిద్ధం'**

'భారత్ సెమీకండక్టర్లను తయారు చేస్తుంటే, పాకిస్తాన్ ఆత్మాహుతి దళాలను ఉత్పత్తి చేస్తోంది. భారత్ అంతరిక్ష యాత్రలకు ప్రసిద్ధి చెందితే, పాకిస్తాన్ ప్రాక్సీ మిషన్లను నడుపుతోంది. భారత్ అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపు తుంటే, పాక్ మాత్రం సరిహద్దు దాటించి ఉగ్రవాదులను పంపడంలో నిమగ్నమై ఉంది. భారతదేశం ప్రపంచానికి సాఫ్ట్‌వేర్‌ను అందిస్తుంటే, పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని సరఫరా చేస్తోంది. భారతదేశం డేటా సెంటర్లను నిర్మిస్తుంటే, పాకిస్తాన్ రాడికలైజేషన్ కేంద్రాలను నిర్మిస్తోంది. భారతదేశం యూపీఐ ద్వారా ప్రపంచాన్ని అనుసంధానిస్తుంటే, పాకిస్తాన్ హవాలా ద్వారా ఉగ్రవాదాన్ని అనుసంధానిస్తోంది. మన మార్గాలు వేరు. పాకిస్తాన్ తన దుష్ట పన్నాగాలతో మన పురోగతికి ఆటంకం కలిగించడానికి ప్రయత్నిస్తే, మన ధైర్యవంతులైన సాయుధ దళాలు తగిన విధంగా సమాధానం ఇవ్వడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నాయి' అని రాజ్?నాథ్ సింగ్ అన్నారు. అంతకుముందు ఎక్స్ వేదికగా కూడా రాజ్‌నాథ్ సింగ్ కార్గిల్ అమరులకు నివాళులర్పించారు. 1999లో కార్గిల్ పర్వత శిఖరాలపై దేశ రక్షణ కోసం అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి ప్రాణత్యాగం చేసిన ప్రతి సైనికుడికి దేశం ఎల్ల ప్పుడూ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. భారత సాయుధ దళాల అచంచల ధైర్యం, త్యాగం, దేశభక్తి భావితరాలకు దేశసేవ, విధి నిర్వహణ, మాతృభూమి కోసం సర్వస్వం అర్పించే స్ఫూర్తిని అందిస్తూనే ఉంటాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

## కార్గిల్ వీరుల శౌర్యం దేశానికి స్ఫూర్తి'



కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భారత సాయుధ దళాల వీర జవాన్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాళులర్పించారు. దేశ భద్రత కోసం అసాధారణ ధైర్యసాహసాలు, అంకితభావంతో పోరాడిన సైనికుల పట్ల యావత్ దేశం కృతజ్ఞతాభావంతో ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేస్తూ, కార్గిల్ యుద్ధ వీరుల పరాక్రమాన్ని స్మరించుకున్నారు. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత్ భూభాగాన్ని రక్షించేందుకు వారు కనబరిచిన శౌర్యం దేశానికి గర్వకారణంగా నిలుస్తుందని తెలిపారు. మన మాతృభూమి రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన ఆ వీర యోధులకు నివాళులు అర్పిస్తున్నాని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎక్స్?లో పోస్ట్ చేశారు. వారి సాటిలేని ధైర్యసాహసాలు, అచంచలమైన సంకల్పం, దేశభక్తి భావి తరాలకు నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటుందని అన్నారు. వారికి ఎప్పటికీ రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

**భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తి : మోదీ**

"కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భారత భద్రత కోసం అసాధారణ ధైర్యం, అంకితభావం ప్రదర్శించిన మన వీర సైనికులకు దేశం తన కృతజ్ఞతను తెలియజేస్తోంది. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో వారు కనబరిచిన పరాక్రమం ఎప్పటికీ జాతీయ గర్వానికి ప్రతీకగా నిలుస్తుంది. 1999 కార్గిల్ యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ల దేశభక్తి, విధి నిర్వహణలో వారి నిబద్ధత భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తుంది. దేశం కోసం చేసిన వారి త్యాగాన్ని భారత ప్రజలు ఎప్పటికీ మరువలేరు" అని ప్రధాని పేర్కొన్నారు.

మరోవైపు 1999 కార్గిల్ యుద్ధం తర్వాత కూడా చొరబాటుదారుల ఉద్దేశంలో ఎలాంటి మార్పు రాలేదని, ప్రాక్సీ యుద్ధం, చొరబాట్ల వంటి మార్గాల ద్వారా భారత్‌ను అస్థిరపరిచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అయితే అలాంటి ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు భారత సైన్యం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. కార్గిల్ విజయ్ దివస్ వార్షికోత్సవం సందర్భంగా శనివారం లద్ధాఖ్‌లోని ద్రాస్ వద్ద సైనికుల కోసం ఏర్పాటు చేసిన 'శౌర్య భోజ్' కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. దేశ రక్షణ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాజ్?నాథ్ అన్నారు. సాయుధ దళాల ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సైన్యానికి అత్యాధునిక ఆయుధాలు, సాంకేతిక పరికరాలు, అత్యుత్తమ శిక్షణ అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యంతో రక్షణ రంగంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నామని, ఈ దిశగా భారత సాయుధ దళాలు ప్రపంచంలోనే అత్యుత్తమ సైన్యంగా ఎదుగుతాయనే పూర్తి విశ్వాసం తనకు ఉందని పేర్కొన్నారు.

**'దేశభక్తే సైనికుల అసలైన బలం'**

కార్గిల్ యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన సైనికుల త్యాగాలను రాజ్‌నాథ్ సింగ్ స్మరించుకున్నారు. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తక్కువ ఆక్సిజన్, తీవ్ర చలిని లెక్కచేయకుండా భారత భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్న వీర జవాన్ల ధైర్యసాహసాల వల్లే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛగా, గర్వంగా జీవిస్తున్నారని కొనియాడారు. ద్రాస్‌లో ఉండటం తనకు ఎంతో గర్వకారణమని, అక్కడ అనుభవిస్తున్న భావోద్వేగాలను మాటల్లో చెప్పలేనని అన్నారు. భారత సైనికుల్లో ఉన్న దేశభక్తి, అంతర్గత ధైర్యసాహసాలే వారి గొప్ప బలమని పేర్కొన్నారు. ఈ విలువలు ఉన్నంతకాలం ప్రపంచంలో ఏ శక్తీ భారత్‌పై చెడు దృష్టి పెట్టే సాహసం చేయలేదని, చేయదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**ఆపరేషన్ విజయ్‌తో చారిత్రక విజయం**

1999 మే నెలలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) దాటి చొరబాటుదారులు కార్గిల్ ప్రాంతంలోని ఎత్తైన శిఖరాలను ఆక్రమించారు. శ్రీనగర్-లేహ్‌ను కలిపే జాతీయ రహదారి-1ఏను దెబ్బతీయాలన్న ఉద్దేశంతో ఈ చొరబాటు జరిగినట్లు అప్పట్లో వెల్లడైంది. ఈ పరిస్థితుల్లో భారత సైన్యం 'ఆపరేషన్ విజయ్' పేరుతో ప్రతిదాడి ప్రారంభించింది. అత్యంత క్లిష్టమైన పర్వత ప్రాంతాల్లో రెండు నెలలకు పైగా సాగిన సైనిక చర్యల్లో భారత జవాన్లు అడుగడుగునా పోరాడి, ఆక్రమిత ప్రాంతాలన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకున్నారు. జులై 26, 1999న ఆపరేషన్ విజయవంతంగా ముగియడంతో ఆ రోజును ప్రతి ఏడాది కార్గిల్ విజయ్ దివస్‌గా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు.

# విద్యార్థుల డిమాండ్ న్యాయమైనదే

దిల్లీలో జులై 20న శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన పోలీసుల చర్యల గురించి కేంద్రంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. నిరసనకారులపై జరిగిన అమానుష దాడికి బాధ్యులెవరో వెల్లడించాలని అన్నారు. పెల్లెట్? గన్స్ వంటి ప్రాణాంతక ఆయుధాల వినియోగానికి ఎవరు అనుమతి ఇచ్చారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అమిత్?షాకు లేఖ రాశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత నిరసన ప్రతి పౌరుడి హక్కని, అలాంటి నిరసనకారుల భద్రతను కాపాడుతూ వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.



విద్యార్థులు న్యాయమైన, జవాబుదారీతనం కలిగిన విద్యా వ్యవస్థను కోరుతూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారని రాహుల్ గాంధీ తెలిపారు. అయితే వారి గొంతును వినాల్సిన బదులు భద్రతా బలగాలు విచక్షణారహితంగా బలప్రయోగానికి పాల్పడ్డాయని ఆరోపించారు. టియర్‌గ్యాస్‌తో పాటు ప్రాణాంతక ఆయుధాలు కూడా ఉపయోగించారని పేర్కొన్నారు. ఈ ఘటనల్లో వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారని రాహుల్ గాంధీ అన్నారు. మహిళా విద్యార్థులపై కూడా పోలీసులు దాడులకు పాల్పడ్డారని, వారిని అవమానించే విధంగా ప్రవర్తించారంటూ ఆరోపించారు.

**'పెల్లెట్ గన్స్ వినియోగమే ఆందోళనకరమై విషయం'**

అత్యంత ఆందోళనకరమైన విషయం పెల్లెట్ గన్స్ వినియోగమేనని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మీడియా, సామాజిక మాధ్యమాల్లో వెలువడిన కథనాల ప్రకారం పలువురు తీవ్ర గాయాలపాలయ్యారని, ఒక జర్నలిస్టు కూడా గాయపడినట్లు తెలిపారు. పెల్లెట్ గన్స్ కారణంగా తీవ్రంగా గాయపడిన 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోచబ్‌ను తాను పరామర్శించినట్లు రాహుల్ గాంధీ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం అతడు తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నాడని, ఒక కన్ను కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**అమిత్ షాకు రాహుల్ ప్రశ్నలు**

దిల్లీలో విధులు నిర్వహించే భద్రతా బలగాలు చివరికి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోనే పనిచేస్తాయని గుర్తుచేసిన రాహుల్ గాంధీ, ఈ ఘటనపై అమిత్ షాకు పలు ప్రశ్నలు సంధించారు. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ సహా ప్రాణాంతక బలప్రయోగానికి మీరు అనుమతి ఇచ్చారా? ఒకవేళ ఇవ్వకపోతే ఆదేశాలు జారీ చేసింది ఎవరు? సాధారణ దుస్తుల్లో కనిపిస్తూ లాఠీలతో విద్యార్థులపై దాడి చేసిన వ్యక్తులు పోలీసులు లేదా స్వచ్ఛంద కార్యకర్తలా? వారిని అక్కడ మోహరించేందుకు అనుమతి ఇచ్చింది ఎవరు? ఈ ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

**'ప్రజాస్వామ్యంలో నిరసనలు కీలకం'**

శాంతియుత నిరసనలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైనవని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. నిరసనకారులపై ఇలాంటి హింసాత్మక చర్యలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని అన్నారు. దేశ భవిష్యత్తైన యువత సమాధానాలు, జవాబుదారీతనం కోరుతోందని, వారి గొంతును ఎవరూ అణిచివేయలేరని లేఖలో పేర్కొన్నారు. విద్యార్థులపై జరిగినట్లు ఆరోపణలు వస్తున్న బలప్రయోగానికి కారణమైన వారిపై విచారణ జరిపి, బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తున్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ, విద్యార్థులపై జరిగిన పరిణామాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఈ మొత్తం వ్యవస్థకు నాయకత్వం వహిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులకు, దేశ భవిష్యత్తుకు క్షమాపణ చెప్పాలని కోరారు.


నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రారంభమైన ఈ ఉద్యమానికి 'కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)' నాయకత్వం వహించింది. జూన్ 20న జంతర్‌మంతర్‌లో ప్రారంభమైన నిరసనలు, జూన్ 28న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించిన తర్వాత దేశవ్యాప్తంగా విస్తరించాయి. జులై 20న పార్లమెంట్ వైపు నిరసన ర్యాలీగా వెళ్తున్న ఆందోళనకారులపై పోలీసులు చేపట్టిన చర్యల తర్వాత ఈ ఉద్యమానికి మరింత మద్దతు లభించింది. అనంతరం ప్రభుత్వం సీజేపీ ప్రతినిధులతో చర్చలు జరిపి వారి డిమాండ్లను అంగీకరించింది.

## సంపాదకీయం

# దుర్భిక్ష పర్వం

ఈ ఏడాది వానలు ముఖం చాటేస్తున్నాయి. రైతుల కళ్లల్లో దిగులు మబ్బులు కనిపిస్తున్నాయే గాని, ఎక్కడా చినుకుల సవ్వడి వినిపించడం లేదు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవకుంటే, చాలినన్ని తిండి గింజలు పండక కరవు కాటకాలు తప్పవు. అనావృష్టి తెచ్చిపెట్టే కరవు కాటకాలు సామాన్యుల బతుకులను దుర్భరం చేస్తాయి. ప్రధానంగా మనది వ్యవసాయాధారిత దేశం. వ్యవసాయాన్నే నమ్ముకుని, దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న కర్షక జనాభా వర్షాభావం వల్ల కష్టాల్లో పడితే, యావత్ దేశానికే కష్టాలు తప్పవు. వర్షాల కోసం క్రమం తప్పక యజ్ఞయాగాదులు చేసే సంస్కృతి మనది. వర్ష ప్రాధాన్యం పట్ల ఎరుక కలిగిన జాతి మనది. 'అనావృష్టి మతీత్యైవ మహతీ వర్షసంతతిః/ భూతానాం సంక్షయం చక్రే దుర్భిక్ష పరిపీడితమ్' అని విష్ణుపురాణం చెబుతోంది. అనావృష్టి వల్ల పంటలు పండక దుర్భిక్షంతో మనుషులే కాదు, సమస్త ప్రాణులూ సంక్షోభానికి, నాశనానికి లోనవుతాయి. కరవు కాటకాలు మన దేశానికి కొత్త కాదు. వానలు లేక, నేల నెర్రెలు పడిన దుర్భర దుర్భిక్ష వర్ణనలు మన పురాణ సాహిత్యం మొదలుకొని ఆధునిక సాహిత్యం వరకు చాలానే ఉన్నాయి. 'అదే పెన్న! అదే పెన్న!/ నిదానించి నడు/ విదారించు నెదన్, వట్టి/ ఎడారి తమ్ముడు!' అంటూ 'పెన్నేటి పాట' రాసిన విద్వాన్ విశ్వం ఒకనాటి రాయలసీమ కరవు దృశ్యాన్ని హృదయ విదారకంగా చిత్రించారు. కరవు కాటకాలను ముందుగా తెలుసుకునే సాంకేతికత ఇదివరకు ఉండేది కాదు. అందువల్ల దుర్భిక్షాన్ని దైవఘటనగానే పరిగణించేవారు. ఇటీవలి కాలంలో సాంకేతిక పెరిగింది. అతివృష్టి, అనావృష్టి పరిస్థితు లను; అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫానుల వంటి ప్రకృతి విపత్తులను ముందు గానే గ్రహించి, వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరికలు చేయగలుగుతున్నారు. పాలకులు బాధ్యతనెరిగిన వారైతే, వాతావరణ శాస్త్రవేత్తల హెచ్చరికలను పట్టించుకుని కార్యాచరణను ప్రారంభిస్తారు. పాలకులు బాధ్యతను మరచి, హాలికులను వారి కర్మానికి వారిని విడిచిపెడితే, దుర్భిక్ష పర్యవసానాలు మరింత దుర్భరంగా ఉంటాయి. ఈసారి 'సూపర్ ఎల్ నినో' పరిస్థితులు ఏర్పడనున్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు వేసవిలోనే హెచ్చరికలు చేశారు. ఈ హెచ్చరికలు ఒకవైపు రైతులలో గుబులు పెంచుతుంటే, మరోవైపు చీకటి వ్యాపారులలో, రాజకీయ దళారులలో, అవినీతిలో మునిగితేలే అధికార గణాల్లో సంబరాన్ని పెంచుతున్నాయి. కరవును కూడా సొమ్ముచేసుకోగల సమర్థులు మనకు కొత్త కాదు. ఇలాంటి దౌర్భాగ్యాన్ని గురించే పాత్రికేయుడు సాయినాథ్ 'ఎవ్రీబడీ లవ్స్ ఎ గుడ్ డ్రౌట్' పుస్తకాన్ని ముప్పయ్యేళ్ల కిందటే రాశారు. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అని నేలను నమ్ముకున్న రైతు కలలోనైనా కరవు కాటకాలను కోరుకోడు. రోజువారీ పనులు చేసుకుంటూ అన్నం తిని బతికే సామాన్య ప్రజలు కూడా కరవు కాటకాలను కోరుకోరు. ప్రతి సంక్షోభాన్నీ స్వీయ సంక్షేమ అవకాశంగా మార్చుకొనే దౌర్భాగ్యులే దుర్భిక్షాన్ని కోరుకుంటారు. 'వార్ధుషికః వణిగ్బంధుః యే చ ప్రభూతమన్న సంగ్రహం/ కృత్వా దుర్భిక్షం వాంఛంతి తే పి వార్ధుషికా' అని ప్రాచీన సుభాషిత శ్లోకం చెబుతుంది. వర్తకులకు అధిక వడ్డీలకు అప్పులిచ్చి, జనాలను పీడించే వడ్డీ వ్యాపారులు దేశంలో కరవు కాటకాలు రావాలని కోరుకుంటారని ఈ శ్లోక సారాంశం. ఇప్పటి కాలంలో వడ్డీ వ్యాపారులకు జతగా కార్పొరేట్ ఫైనాన్స్ కంపెనీల నిర్వాహకులు, రాజకీయ దళారులు, లంచగొండి అధికారులు కూడా జనాలకు దాపురించారు. వీళ్లందరూ కరవులో అధికమాసం లాంటివారు. ఈ ఏడాది 'సూపర్ ఎల్ నినో' కారణంగా భారత్ సహా ఎనభై ఎనిమిది దేశాలు తీవ్ర వర్షాభావంతో అల్లాడనున్నాయి. ఇది కేవలం ప్రకృతి పరిణామం మాత్రమే కాదు, ఇంగితం లేని పాలకుల చర్యలకు పర్యవసానం కూడా! భూతాపం పెరుగుదలపై పర్యావరణవేత్తలు మొత్తుకుంటూనే ఉన్నా, కొందరు దేశ్యాధినేతలు యుద్ధ విధ్వంసాల్లో మునిగితేలుతున్నారు. ఇంకొందరు అభివృద్ధి పేరుతో అడవుల నరికివేతకు ఊత మిస్తున్నారు. ఈకాలం దుర్భిక్షం బాధ్యతెరుగని పాలకుల స్వార్థఫలం.

# ఆందోళనల వెనుకున్నది అధికార దాహమే!



వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయని ప్రభుత్వం నుంచి ప్రకటన రాగానే నిద్రాణమై ఉన్న భారత వ్యతిరేక అదృశ్య శక్తులు ఒక్కసారిగా మేల్కొన్నాయి. ఇప్పుడు ఢిల్లీలో నెలకొన్న పరిస్థితులు, వాటి వెనకున్న కారణాలను అన్వేషిస్తే విస్తుపోయే వాస్తవాలు బయటపడుతున్నాయి. ప్రభుత్వం పట్ల వ్యతిరేకతలు, భిన్నాభిప్రాయాలు కలిగి ఉండటం సహజం. భారతదేశం వంటి ఆదర్శ ప్రజాస్వామ్య రాజ్యంలో గతంలో ఎన్నో ఆందోళనలు జరిగాయి కానీ, ఇంత విద్వేషపూరితమైన, అసాధారణమైన పరిస్థితులు చూడటం బహుశా ఇదే మొదటిసారికావచ్చు. ఇవన్నీ చూస్తుంటే దేశంలో జరుగుతున్న అసహన రాజకీయాలు రూపుమార్చుకొని, అంతమొందించే రాజకీయాలుగా రూపాంతరం చెందాయన్న విషయం తెలుస్తోంది.

పక్కా ప్రణాళిక ప్రకారం విచ్ఛిన్నకర శక్తులు దేశంలో అలజడి సృష్టించడానికి ఎదురుచూస్తుండగా వచ్చిన ఈ అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని, అవి తమ దుశ్చర్యలకు రూపం కల్పించినట్టుగా ఈ ఆందోళన కనిపిస్తోంది. ఎన్నో ఏళ్లుగా అధికారం కోసం అర్రులు చాస్తూ వస్తున్న అవకాశవాద రాజకీయ నాయకులు తమ నిజస్వరూపాన్ని, ఈ దేశం పట్ల వారికున్న దురుద్దేశాన్ని, దేశ ప్రజల సంక్షేమం పట్ల వారికున్న నిర్లక్ష్య భావాన్ని నేడు బట్టబయలు చేస్తున్నారు.

ఇరవై ఆరు రోజులుగా నిరాహార దీక్ష చేసిన వాంగ్‌చుక్ గత చరిత్ర కూడా దేశ వ్యతిరేక కార్యకలాపాలతోనే ముడిపడి ఉంది. చైనాకు మద్దతుగా, పీఓకేను ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా పాకిస్థాన్‌లో కలపాలని వాదించిన వ్యక్తి. పర్యావరణ కార్యకర్తగా, విద్యావేత్తగా గుర్తింపు పొందిన వాంగ్‌చుక్ చేసినవన్నీ దేశ వ్యతిరేక కార్యకలాపాలే.

నిజంగా ఇది నీట్ కోసం జరిగిన ఉద్యమమే అయితే, అక్కడ నీట్ విద్యార్థులు కానీ, కనీసం వారి తల్లిదండ్రులు కానీ కనిపించలేదు. ఇప్పటివరకూ దేశంలో వందల పేపర్ లీకేజీలు జరిగాయి. అది వ్యవస్థలోని లోపాలను ప్రతిసారీ ఎత్తిచూపుతూనే ఉంది. అదీగాక, రీ--ఎగ్జామ్ జరిగి ఫలితాలు వచ్చిన తర్వాత, నిందితులను గుర్తించి అరెస్టు చేసిన తర్వాత కూడా ఆందోళనలు కొనసాగడం వెనుక వారి ఉద్దేశం ఏమిటి? అధికార దాహంతో వ్యవహరిస్తున్న శక్తులు తమ దుష్ట ఉద్దేశాలను అమలు చేయడానికి యువత బలహీనతలను అవకాశంగా మార్చుకుంటున్నాయి. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లో వలే ఇక్కడ కూడా అశాంతి సృష్టించేలా దేశద్రోహ కార్యక్రమాలు చేపట్టి, ప్రభుత్వంపై తిరుగుబాటు జరుగుతున్నట్లు చిత్రీకరించాలనే వారి కుట్ర బయటపడుతోంది. కాక్రోచ్ పార్టీ నాయకులు కొంతకాలం క్రితం జంతర్ మంతర్ వద్ద చేసిన వ్యాఖ్యలు కూడా ఇదే విషయాన్ని బహిర్గతం చేశాయి.

అంతేకాకుండా, ఆందోళనల సమయంలో మహిళల పట్ల అనుచిత ప్రవర్తన, అసభ్య వ్యాఖ్యలు చేయడం, మహిళా జర్నలిస్టులను దుర్భాషలాడడం వంటి ఘటనలు ఏ ఉద్యమానికీ సమర్థనీయమైనవి కావు. ఇంటర్నెట్‌ను నిలిపివేసిన పరిస్థితుల్లో కూడా మెసేజింగ్ యాప్‌ల ద్వారా ఆందోళనలకు రూపకల్పన చేయడం, నిఘా వర్గాలకు చిక్కకుండా హింసాత్మక చర్యలను నిర్వహించడం వంటి అంశాలను కూడా గమనించాల్సిన అవసరం ఉంది. ఇది ప్రేరేపిత ఉద్యమం కాకపోతే కేవలం జంతర్ మంతర్ వద్ద ఆందోళనలకు వచ్చినవారు.. భద్రతా దళాల కన్నుగప్పి ప్రధాని నివాసంపై దాడికి యత్నించడం, ఒక్కసారిగా ప్రతిపక్ష నాయకులు ప్రధాని నివాసానికి చేరుకుని ఆందోళన చేయటం రాజకీయ కుట్ర కాక మరేమిటి? అంతకు మూడు రోజుల ముందు అమెరికా వంటి దేశం తన పౌరులకు అడ్వైజరీ జారీ చేయడం గమనించాల్సిన విషయం. ఆందోళనకారులకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? అనే విషయాన్ని కూడా కేంద్ర నిఘా సంస్థలు పరిశీలిస్తున్నాయి.

ప్రపంచంలోని కొన్ని దేశాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. భారతదేశాన్ని అంతర్జాతీయంగా అస్థిరంగా చూపించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అలాగే, దేశంలో రాజకీయంగా బలపడలేని, ప్రజా మద్దతు లేని నాయకులు, 'అసహనం' పేరుతో గతంలో ఉద్యమాలు చేసినవారు, ఆపరేషన్ కగార్ ఆపి నక్సల్స్‌ను కాపాడాలని చర్చలు జరపాలన్నవారు, అవార్డులు వాపస్ ఇచ్చిన ప్రముఖులను ఇప్పుడు తమ డిమాండ్లకు మద్దతుగా నిలబెట్టే ప్రయత్నం చేయడం రాజకీయ అసహనం కాక మరేమిటి? అలాంటి రాజకీయ పార్టీలు నేటి ఆందోళనకారులకు తోడవడం వారి ఉద్దేశాలను బట్టబయలు చేసింది. అక్కడకు వచ్చిన యువత సహజంగా వచ్చినవారు కాదు; వివిధ రాజకీయ పార్టీలు పంపిన పెయిడ్ బ్యాచ్‌లుగా కనిపించారు. అక్కడ ఉన్న మీడియా ప్రతినిధులపై కూడా దాడులు చేశారు. పోలీసులపై, సాయుధ బలగాలపై చెలరేగి, వారిని రెచ్చగొట్టి లాఠీచార్జికి ప్రేరేపించే ప్రయత్నం జరిగింది. గతంలో హైదరాబాద్‌లో జరిగిన రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనను జాతీయ సమస్యగా చిత్రీకరించినట్లుగానే, ఇక్కడ కూడా ప్రతిపక్ష పార్టీలు అన్నీ ఒక్కటై ఆ మంటల్లో చలి కాచుకునే ప్రయత్నం చేశాయి. ఇప్పటికీ తెలంగాణలో నక్సల్ సానుభూతిపరులకు, అర్బన్ నక్సల్స్‌కు ప్రభుత్వం ప్రత్యక్షంగా ఆశ్రయం ఇస్తూ, సమయం వచ్చినప్పుడు వారిని రాజకీయ దాడులకు వాడుకుంటోంది. విదేశాల్లో పుట్టిన కాక్రోచ్ పార్టీ... ప్రతిపక్షాలతో చేరి, తమకున్న అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంటూ, మోదీ ప్రభుత్వాన్ని కూల్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. కేంద్ర మంత్రులు పార్లమెంట్ వేదికగా చర్చకు అంగీకరించారు. కానీ, చర్చలో పాల్గొనకుండా తమ విధ్వంసక చర్యలను కొనసాగించడానికి మొగ్గు చూపిన కాక్రోచ్ పార్టీ అంతరంగం అర్థమవుతోంది. ప్రధాని మోదీ ఈ పేపర్ లీకేజీ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని, ఇప్పటికే సంబంధిత మంత్రులతో చర్చించారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు. పేపర్ లీకేజీల విషయంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరిపించి, వేగంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని కూడా ప్రకటించారు.

బలహీనమైన దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్లో జరిగిన హింసాత్మక పరిణామాలను భారతదేశంలో కూడా పునరావృతం చేయాలనే కుట్రలు ఎప్పటికీ విజయవంతం కావు. చైతన్యవంతమైన భారత యువత ఇవన్నీ గమనిస్తూనే ఉంది. గోరంతను కొండంతగా చూపిస్తూ యువతను, విద్యార్థులను రెచ్చగొట్టే రాజకీయాలను దేశం సహించదు. సమయం వచ్చినప్పుడు ఈ దేశ యువత ప్రతిపక్షాలకు తప్పక సమాధానం ఇస్తుంది.

# ఈ కుట్ర సిద్ధాంతాలకు కాలం చెల్లింది!

ఢిల్లీ అధికార కారిడార్లలో కుట్ర సిద్ధాంతాలు నిరంతరం వినిపిస్తూనే ఉంటాయి. నేటి రాజకీయ భారతంలో అవి గుసగుసల కంటే బిగ్గరగా వినిపిస్తున్నాయి. ఇప్పుడు అవి రాజకీయ ఆయుధాలుగా పరిణమించాయి. దేశ రాజధానిని కుదిపేసిన విద్యార్థుల నిరసనలతో సంబంధమున్న సోనమ్ వాంగ్‌చుక్, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సభ్యులు తాజా కుట్ర సిద్ధాంతాలకు లక్ష్యాలుగా ఉన్నారు. ప్రశ్నపత్రాల లీక్‌లు, తగ్గిపోతున్న ఉద్యోగావకాశాలు, నియామకాల్లో జాప్యాలపై లక్షలాది యువ భారతీయులు ఎందుకంతగా ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారో అర్థం చేసుకోకుండా, వారి ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్నవారి ఉద్దేశాలను ప్రశ్నించేందుకే రాజకీయ పార్టీలు ప్రాధాన్యమిస్తున్నాయి.

వాంగ్‌చుక్, సీజేపీలు మోదీ ప్రభుత్వ 'రహస్య రాజ్య వ్యవస్థ' (డీప్ స్టేట్)లో భాగమే అని కాంగ్రెస్ శ్రేణుల్లో బాగా ప్రచారంలో ఉన్న ఒక సిద్ధాంతం చెబుతోంది. 'నీట్' పరీక్షల గందరగోళంపై ప్రజ్వరిల్లిన ఆందోళనల నుంచి రాజకీయలబ్ధి పొందకుండా కాంగ్రెస్‌ను నివారించేందుకే వాంగ్‌చుక్, సీజేపీని మోదీ సర్కార్ 'డీప్ స్టేట్' రంగంలోకి దించిందనేది ఆ సిద్ధాంత సారాంశం. ఇదొక అసాధారణ వాదన. దీనికి సాక్ష్యాధారాలు ఏవీ లేవు. అయితే వాస్తవాల కంటే అనుమానాలే మహా వేగంగా విస్తరిల్లి, వర్ధిల్లే వర్తమాన యుగంలో కుట్ర సిద్ధాంతాల శీఘ్రగతిన బాగా ప్రభావదాయకమవుతున్నాయి. లద్దాఖ్‌కు మరింత స్వతంత్ర ప్రతిపత్తి నివ్వాలని డిమాండ్ చేస్తూ ఆ హిమాలయ ప్రాంతవాసులు ఏడాది క్రితం నిర్వహించిన ఆందోళనలో హింసాత్మక ఘటనలు సంభవించాయి. వాటికి సోనమ్ వాంగ్‌చుక్ బాధ్యుడు అనే ఆరోపణతో ఆయనను జాతీయ భద్రతా చట్టం కింద అరెస్ట్ చేశారు. ఆరు నెలలపాటు జైలు నిర్బంధంలో ఉన్న తరువాత విడుదల చేశారు. అరెస్ట్ చేయడానికి కారణాలు ఏమిటో ప్రభుత్వం చెప్పనే లేదు. వాంగ్‌చుక్ జైలులో ఉన్న సమయంలో బీజేపీ సామాజిక మాధ్యమాలలో ఆయనను విదేశీ నిధులు పొందుతున్న 'జాతి వ్యతిరేకి'గా చిత్రించారు. 'చైనా ఏజెంట్' అని కూడా ఆరోపించారు. తమ రాజకీయ కథనాలను సమర్థించుకోవడానికై వాంగ్‌చుక్ ఉపన్యాసాల నుంచి ఎంపిక చేసిన మాటలను ఉల్లేఖించారు.

ఇప్పుడు అదే వ్యక్తిని ఇంటెలిజెన్స్ బ్యూరో చేతుల్లో కీలుబొమ్మ అని కాంగ్రెస్ శ్రేణులు నిందిస్తున్నాయి. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న పోరాటం, రాహుల్‌గాంధీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు వాంగ్‌చుక్‌ను ఉపయోగించుకుంటున్నారని ప్రధాన ప్రతిపక్షం ఆరోపిస్తోంది. 'చైనా ఏజెంట్'గా ఆరోపణలకు గురైన వ్యక్తి భారత ప్రభుత్వ ఏజెంట్‌గా ఎలా పరిణమించాడు? తమ నీడను చూసి జడుసుకునే రాజకీయవాదుల భయానుమానాలలోని అసంబద్ధతను వాంగ్‌చుక్‌పై ఈ నిందలు బహిర్గతం చేస్తున్నాయి.

వాంగ్‌చుక్ నాకు రెండు దశాబ్దాలుగా తెలుసు. విద్యారంగం, పర్యావరణ పరిరక్షణలో ప్రశస్త కృషికి గాను 2008లో సీఎన్ఎన్--ఐబీఎన్ వార్తా సంస్థ వాంగ్‌చుక్‌ను 'రియల్ హీరో'గా గౌరవించి సత్కరించిన సందర్భంలో నేను ఆయనను మొదటిసారి కలుసుకున్నాను. ఆనాటి సభలో నటుడు ఆమిర్‌ఖాన్ కూడా ఉన్నారు. ఆ తరువాత ఆయన నటించిన 'త్రీ ఇడియట్స్' సినిమా వాంగ్‌చుక్ జీవితం నుంచి స్ఫూర్తి పొందినట్టుగా ప్రచారం జరిగింది. విద్యారంగంలో మౌలిక మార్పులకు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పరిపూర్తికి, లద్దాఖ్ భవిష్యత్తుకు వాంగ్‌చుక్ చేస్తున్న కృషిని నేను చాలా సంవత్సరాలుగా గమనిస్తూ వస్తున్నాను. వాంగ్‌చుక్ ప్రతిష్ఠాత్మక రామన్ మెగసెసే అవార్డు గ్రహీత. గతంలో అన్ని రాజకీయ పార్టీలు సమున్నతంగా గౌరవించిన వ్యక్తి, ఇప్పుడు ఎవరు మాట్లాడుతున్నారు అన్నదానిపై ఆధారపడి ఆయన దేశద్రోహిగానో లేక ప్రభుత్వ ఏజెంట్‌గానో ఎలా అయ్యారు? మోదీ ప్రభుత్వం సైతం ఆయనను పలుమార్లు బహిరంగంగా ప్రశంసించింది. మార్చి 2023లో వాంగ్‌చుక్, ఆయన సతీమణితో సమావేశమైన తరువాత వారితో తాను దిగిన ఫొటో నొకదాన్ని ధర్మేంద్ర ప్రధాన్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు, వివిధ రంగాలలో ఆ దంపతులు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. మూడు సంవత్సరాల తరువాత నీట్ వివాదంలో ప్రభుత్వాన్ని నిలదీసినందుకుగాను వాంగ్‌చుక్‌పై బీజేపీ నాయకుల గౌరవాభిమానాలు పూర్తిగా తుడిచిపెట్టుకు పోయాయి. వాంగ్‌చుక్ లేవనెత్తిన ప్రశ్నలపై చర్చించడానికి బదులుగా ఆయన ఉద్దేశాలను అనుమానిస్తున్నారు. మరొక ఉదంతాన్ని కూడా ప్రస్తావించవలసి ఉన్నది. 'లేహ్ అటానమస్ డెవలెప్‌మెంట్ కౌన్సిల్' వాంగ్‌చుక్ ఆధ్వర్యంలోని హిమాలయన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్‌నేటివ్స్'కు 1000 కనాల్స్ (8 కనాల్‌లు ఒక ఎకరానికి సమానం) భూమిని కౌలుకు ఇచ్చింది. ఆ తరువాత ఆ కౌలును రద్దు చేసింది. లద్దాఖ్ స్వతంత్ర ప్రతిపత్తి ఉద్యమంలో వాంగ్‌చుక్ కీలకపాత్ర వహిస్తున్న కారణంగానే ఈ రద్దు జరిగిందన్నది స్పష్టం. భిన్నాభిప్రాయ వ్యక్తీకరణను ప్రజాస్వామిక స్వేచ్ఛగా కాకుండా ఒక విరోధ చర్యగా పరిగణించడం వల్లే ఇలా జరిగింది. ప్రభుత్వ నిర్ణయాలతో విభేదించినవారు బెదిరింపులు, వ్యక్తిత్వ హననాలకు గురవుతున్నారు. మోదీ ప్రభుత్వం మొదటి నుంచీ ఇలానే వ్యవహరిస్తోంది. పాత్రికేయులు, విద్యావేత్తలు, పౌర సమాజ కార్యకర్తలు అందరూ ఈ ప్రభుత్వ ఆగ్రహానికి గురవుతూనే ఉన్నారు.

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)ని మోదీ సర్కార్ తొలుత నెలలపాటు పూర్తిగా ఉపేక్షించింది. సీజేపీ కార్యకర్తల నిరసన ఉధృతమైన తరువాతనే దాని ఉనికిని అంగీకరించడం సర్కార్‌కు అనివార్యమయింది. కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే, సీజేపీ అనేది ఆమ్ ఆద్మీ పార్టీకి ఒక పరోక్ష ప్రతినిధి మాత్రమే. కారణం దాని స్థాపకుడు అభిజిత్ దీప్కే గతంలో ఆప్ సోషల్ మీడియాలో పనిచేయడమే! 2011లో అన్నాహజారే ఉద్యమం నుంచే ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభవించి, యూపీఏ ప్రభుత్వ పతనాన్ని వేగవంతం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ను ఇప్పటికీ బాధిస్తూనే ఉన్నది. అయితే చరిత్ర ఒక బందీఖానా కాకూడదన్న వివేకాన్ని చూపకపోతే ఎలా?

సీజేపీ కార్యకర్తలు పలువురితో నేను సంభాషించాను. పార్టీ రాజకీయాలు కాకుండా వ్యవస్థ పట్ల అసంతృప్తే వారి తిరుగుబాటుకు ప్రేరణ. ఈ 'జనతా' వాదులు అనుభవ శూన్యులు, అయితే.. ఆదర్శవాదులు. అప్పుడప్పుడు అవ్యవస్థితులు, అయితే.. కపటరహిత రాజకీయులు. తాము ఎందుకు ఈ ఆందోళనకు పూనుకున్నామని వారు నిర్మొహమాటంగా చెబుతున్నదాన్ని వినడం కంటే-- ఏదో ఒక రాజకీయ పార్టీ ఏజెంట్లు అని కొట్టివేయడం చాలా తేలిక. అసలు ఈ నిర్లక్ష్య వైఖరే ఒక పెద్ద విషాదం. పన్నెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను సహించలేకపోతోంది. అసమ్మతిని పరిగణనలోకి తీసుకోవల్సిన అవసరం లేదని లేదా దానిని అణచివేయవచ్చని విశ్వసిస్తోంది. విమర్శకులను విరోధులుగా, నిరసనకారులను కుట్రదారులుగా చూస్తోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానమంత్రిని బలహీనపరిచేందుకు విదేశీ శక్తులతో కుమ్మక్కయినవారు చేస్తోన్న మరో ప్రయత్నమే సీజేపీ అని ప్రభుత్వం భావిస్తోంది. తమ సమస్యల పరిష్కారానికి ఆందోళన చేస్తున్న యువతపై రాజకీయ నిందారోపణలు చేయడం రాజకీయపక్షాలకు తగదు. కుట్రసిద్ధాంతాలలో పావులుగా వారిని పరిగణించకూడదు. అంతకంటే మెరుగైన విషయాలకు యువ భారతీయులు అర్హులు. ప్రశ్నపత్రాల లీక్‌కు కారణాలు ఏమిటో వారికి స్పష్టంగా వివరించాలి. ఉద్యోగ నియామకాల్లో జాప్యం ఎందుకు జరుగుతుందో చెప్పాలి. క్షీణిస్తున్న విద్యా ప్రమాణాలను ఎలా మెరుగుపరచనున్నారో స్పష్టంచేయాలి. తగ్గిపోతున్న ఉద్యోగావకాశాల విషయమై సంజాయిషీ చెప్పాలి. తమ ఆకాంక్షలను వినే ప్రభుత్వాలు, తమకు నాయకత్వం వహించే ప్రతిపక్షాలు యువభారతీయులకు అవసరం.

# ఇచ్చోడ లో ఘనంగావాసవి కన్యకా పరమేశ్వరి పూజలు





**ఇచ్చోడ :** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి ముగింపు పూజలు నిర్వహించారు. అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలకేం ద్రంలో స్థానిక హనుమాన్ సాయిఆలయంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి పీఠానికి గతవారం రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ముగింపు ఘట్టంలో భాగంగా పీఠంపై ప్రతిష్టించబడిన వాసవి అ మ్మవారిని మహిళలు హారతులతో సాగనంపారు. ఈ సందర్భంగా పూజారి బుక్క శ్రీనివాస్ మాట్లాడుతూ వాసవి కన్యకా పరమేశ్వరి పీఠాన్ని ప్రతి 5 సంవత్సరాలకు ఓ సారి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు మండలాలకు, గ్రామాలకు తీసుకు వె ళుతూ, అక్కడ పీఠాన్ని నిలిపి వారం రోజుల పాటు మహిళల చేత అన్ని రకాల పూజలు నిర్వహిస్తున్నామని, దీప దూప నైవేద్యాలతో అన్ని రకాల అలంకరణల ను అమ్మవారికి చేయించడం జరుగుతుందని, అమ్మ వారిని ఆడ పడుచ గా భావించి చీర సారీ కట్న కాను కలతో వేరే ప్రాంతానికి తీసుకువెళ్లడం జరుగు తుంద ని, వైశస్వివా టినే సమాజ సేవా అని మేము సమాజానికి సహాయ కారులమని నేను షావుకారులగా రూపాంతరం చెందిందని, ప్రపంచంలో, దేశంలో ప్రజలం దరూ సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు చక్కగా పండాలని, అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడమే ఈ పూజ ముఖ్య ఉద్దేశ్యమని పూజారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గంగిశెట్టి సంతోష్, ఉపాధ్యక్షుడు ఉత్తర్వార్ రాజేందర్, అధ్యక్షుడు రాయి పల్లి సంతోష్, సంఘ సభ్యులు పత్తివార్ మహేష్, కత్తూరి సంజీవ్, కృష్ణ కు మార్, సతీష్, ము క్కా శ్రీనివాస్, కౌటిక్ వార్ మహేష్ డికొండ మహేష్, నరేష్, గందే శ్రీధర్, బచ్చువార్ రాజేష్, సంఘ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రస్తుతం పెద్ద కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి కంపెనీలు లాభాల కోసం కార్మికులపై భారాన్ని మోపుతున్నాయి

### ఏఐటీయూసీ మహాసభల కార్మిక ప్రదర్శనను విజయవంతం చేయాలి

### మంచిర్యాల జిల్లా కార్యవర్గ సమావేశంలో నాయకుల పిలుపు




**మంచిర్యాల :** ప్రస్తుతం పెద్ద కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి కంపెనీలు లాభాల కోసం కార్మికులపై భారాన్ని మోపుతున్నాయని, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) మంచిర్యాల జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మంచిర్యాలలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎం.డి. అక్బర్ అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడారు. ఆగస్టు 2న మంచిర్యాలలో ఏఐటీయూసీ జిల్లా 4వ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు ఉదయం ఐబీ సెంటర్ నుంచి భారీ కార్మిక ప్రదర్శన చేపట్టనున్నామని, జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రదర్శనను, మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ప్రస్తుతం పెద్ద కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి కంపెనీలు లాభాల కోసం కార్మికులపై భారాన్ని మోపుతున్నాయని, ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాలతో పాటు కార్మిక హక్కులపై దాడులు పెరుగుతున్నాయని విమర్శించారు. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గం వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, సమాన హక్కుల సాధన కోసం పోరాటాలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ కార్మిక ఐక్యతను బలోపేతం చేసి, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో ముస్కే సమ్మయ్య, కలిందర్ అలీ ఖాన్, కె. వీరభద్రయ్య, మిట్టపల్లి పౌలు, దాగం మల్లేష్, ఎస్కే బాజీ సైదా, సలేంద్ర సత్యనారాయణ, కొట్టే కిషన్‌రావు, భీమనాధుని సుదర్శన్, జాడి పోషం, దొడ్డిపట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు

## యువత పోరాటమే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాంటెంకి**



**మంచిర్యాల :** యువత పోరాటమే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాంటెంకి అని అన్నారు . నీట్ పేపర్ లేకేజీ కి వ్యతిరేకంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేసి నీట్ విద్యార్థులను ఆదుకోవాలని దేశం లోని యువత పార్లమెంట్ ముట్టడికి పిలుపునిచ్చిందని, ఈ ఉద్యమానికి వేలాది మందిగా తరలి మద్దతు గా నిలిచిందన్నారు ఉద్యమం ఉధృతం కావడం తో కేంద్రం నిరసన కారులతో చర్చలు జరిపి డెడ్ లైన్ పెట్టింది డెడ్ లైన్ కు ముందే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారని తెలిపారు. యువకులు తలుచుకుంటే దేశ రాజాకీయాలె తల క్రిందులు అవుతాయాని టిఆర్పి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాంటెంకి హెచ్చరించారు. సుప్రీం కోర్ట్ సీ.జె.ఐ యువత బద్ధకస్థులు బొద్దింక పురుగుల్లా తయారు అయ్యారు అనే విమర్శలకు కారనంగా ఈ జెంజి ఉద్యమానికి దారి తీసిందని "యూత్ పవర్ ఈస్ నేషనల్ పవర్" యువత తలుచుకుంటే ఏదైనా సాదిస్తారాని ఈ ఉద్యమం ద్వారా తెలిసు కోవాలని ఇకనైనా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ లు బాధ్యత గా పని చేయాలని కోరారు.

## ఫిన్లాండ్ వెళ్లొచ్చిన ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖి





**జన్నారం,** విదేశీ విద్య అధ్యయనానికి ఫిన్లాండ్ వెళ్లొచ్చిన ఉపాధ్యాయులతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ముఖాముఖి నిర్వహించనున్నారు. ఈ నెల 28న మంగళవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో తెలంగాణ విద్యాశాఖ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఫిన్లాండ్‌లో అధ్యయనం చేసిన అక్కడి విద్యా విధానం, అనుభవాలపై జన్నారం మండలం నుండి కిష్టాపూర్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ దాముక కమలాకర్, అక్కపెల్లి గూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యా యులు జాజాల శ్రీనివాస్ తో సీఎంతో చర్చించనున్నారు. జిల్లాలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన మండలాల్లో జన్నారం మండలం రెండవ స్థానంలో ఉంది. ఈ రెండు పాఠశాలల్లో ప్రైవేటు నుండి ఎక్కువ మంది విద్యార్థులు చేరడమే ఇందుకు కారణమని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి బానవత్ రాజేందర్, కిష్టాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయకుమార్ తో పాటు ఉపాధ్యాయులు ఎంపికైన ఇద్దరు టీచర్లను అభినందించారు.

# గృహజ్యోతి జీరో బిల్లు రావట్లేదా? కారణం ఇదే!




**మంచిర్యాల:** గృహజ్యోతి వినియోగదారులు విద్యుత్ వాడకం 200 యూ నిట్ల పరిమితి దాటిపోతున్నారు. దీంతో జీరో బిల్లుకు దూరమై డబ్బులు కట్టుకోవాల్సి వస్తోంది. గృహజ్యోతి పథకం కింద ప్రభుత్వం రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు లబ్ధిదారులకు కరెంట్ బిల్లు జీరో వస్తోంది. అయితే తమ పరిమితి దాటితే మాత్రం జీరో బిల్లు రాదు. దీంతో ఆ మేరకు ఆ నెలలో వచ్చిన బిల్లుమొత్తాన్ని చెల్లించాల్సి వస్తోంది. జిల్లాలో చాలా మంది లబ్ధిదారులు గృహజ్యోతి పథకంలో అర్హులుగా ఉన్నారు. ఇందులో సొంతిల్లు కలిగిన వారితో పాటు అద్దె ఇంట్లో ఉన్నవారు సైతం సర్వీస్ నంబరుపై జీరో బిల్లు పొందుతున్నారు. అయితే తమ నెల వారీ విద్యుత్ వాడకం పెరిగితే మాత్రం జీరో బిల్లుకు దూరమవుతున్నారు.

**వేలల్లో తగ్గుతున్న లబ్ధిదారులు**

గృహజ్యోతి పథకం ప్రారంభమై రెండేళ్లు పూర్తయింది. జిల్లాలో మొదట నమోదైన వారితో పోలిస్తే క్రమంగా తగ్గుతున్నారు. వీరిలో కొందరు వరసగా నెలల తరబడి 200 యూనిట్లు పైబడి విద్యుత్ వాడకం చేస్తున్నారు. దీంతో లబ్ధిదారుల సంఖ్య తగ్గుతోంది. గత మార్చిలో వేసవి ఆరంభం నుంచి గత జూన్ వరకు దాదాపు 18 వేలకు పైగా గృహాలు జీరో బిల్లులకు దూరమయ్యాయి. దీంతో వారంతా ఈ మేరకు బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. వేసవిలో ఎండలను తట్టుకోలేక చాలా మంది గృహాల్లో కూలర్లు, ఏసీలు, ఫ్యాన్లతో విపరీతంగా వాడారు. దీంతో చాలా మంది లబ్ధిదారులు ఎండాకాలంలో రెండు నెలలు జీరో బిల్లులు పొందలేదు. ఈసారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా పడడం లేదు. దీంతో వేసవి తరహాలో వాడకం ఉంటోంది. చాలామంది పరిమిత యూనిట్లు దాటి వాడే అవకాశం ఉంటుంది. దీంతో వీరంతా జీరోబిల్లుకు బదులు డబ్బులు కట్టాల్సి వస్తుంది. అయితే కొన్నిచోట్ల నెల దాటాక రీడింగ్ తీయడంతోనూ బిల్లులు పరిమిత యూనిట్లు దాటుతున్నాయని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

**లబ్ధిదారులే.. కానీ జీరో రాదు**

గృహజ్యోతి పథకం కింద ప్రభుత్వం నిర్ణయించిన 200 యూనిట్ల పరిమితి దాటినప్పటికీ లబ్ధిదారుల జాబితాలోనే కొనసాగుతారు. అయితే నెలవారీగా జీరో బిల్లు మాత్రం రాదు. దీంతో మళ్ళీ పరిమితిలోపే విద్యుత్ వాడకం చేస్తేనే వారందరికీ ఆయా నెలల్లో జీరో బిల్లులు వచ్చే అవకాశం ఉంటుంది. ఈక్రమంలో గృహాల్లో విద్యుత్ వాడకం రోజువారీగా పొదుపుగా వాడితేనే లబ్ధిదారులకు ఈ పథకం నిరంతరాయంగా కొనసాగి, ప్రయోజనం కలగనుంది.

# యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి..

కాంగ్రెస్ జిల్లా నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి,జిల్లా యువనాయకులు నూకల అభినవ్ రెడ్డి
మాకుల వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో వేంకటేశ్వర కిరాణం అండ్ కూల్ డ్రింక్స్ షాప్ ప్రారంభం..





**మరిపెడ,జూలై26(సూర్యరేఖ)** నేటి యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి రంగంలో రాణించి ఆర్థికంగా ఎదగాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి,జిల్లా యువ నాయకులు నూకల అభినవ్ రెడ్డి అన్నారు.ఆదివారం వారు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని మాకుల వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో మరిపెడ గ్రామానికి చెందిన భాషిపంగు రవికాంత్,భాషిపంగు సునీల్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వేంకటేశ్వర కిరాణం అండ్ కూల్ డ్రింక్స్ షాప్‌ను మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...స్వయం ఉపాధి ద్వారా యువత తమ కాళ్లపై తాము నిలబడటంతో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగవచ్చని అన్నారు.వ్యాపారంలో నాణ్యత,నిజాయితీ,వినియోగదారుల విశ్వాసమే విజయానికి పునాదులని పేర్కొన్నారు.ప్రజలకు నాణ్యమైన వస్తువులు,మెరుగైన సేవలు అందిస్తే వ్యాపారం అభివృద్ధి చెందడమే కాకుండా సమాజంలో మంచి గుర్తింపు కూడా లభిస్తుందని చెప్పారు.వ్యాపార రంగంలో అడుగుపెట్టిన భాషిపంగు రవికాంత్,భాషిపంగు సునీల్,లను వారు అభినందించి,వారి వెంకటేశ్వర కిరాణా అండ్ కూల్ డ్రింక్స్ షాప్ మంచి ఆదరణ పొందాలని,వ్యాపారాన్ని మరింత విస్తరించి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పానుగోత్ రాంలాల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్,కౌన్సిలర్ జాటోత్ సురేష్,నాయకులు కుడితి వెంకట్ రెడ్డి,అప్సర్,వెర్మరెడ్డి వెంకట్ రెడ్డి,ముదిరెడ్డి లక్ష్మారెడ్డి, గుండగాని వెంకన్న,మెంచు అశోక్ కుమార్,బోడ రవి,బోడ రమేష్,బానోత్ చిన్నా, ఏడెల్లి సైదులు,బాధావత్ రవి,బాధావత్ సైదులు, సందీప్,రంజిత్ కుమార్,బాలకృష్ణ,శ్రీకాంత్, శివ,అశోక్,నాగన్న, గంధం వీరన్న,నాయకులు ,కార్యకర్తలు,గ్రామ పెద్దలు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## అత్తాపూర్‌లో ప్రధాని మన్‌కీబాత్ కార్యక్రమం వీక్షించిన బీజేపీ శ్రేణులు..



**రాజేంద్రనగర్,జులై26(సూర్యరేఖ)** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు అంజన్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు.అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడా బూత్ నంబర్-218లో డివిజన్ కార్యదర్శి శివరాజ్‌గౌడ్ నివాసంలో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు కలిసి వీక్షించారు.అత్తాపూర్ డివిజన్ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకుడు అంజన్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశాభివృద్ధి, జాతీయ సమైక్యత,ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రధానమంత్రి చేసిన ప్రసంగం ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు.ఆగస్టు 8వ తేదీ నుంచి నిర్వహించనున్న తిరంగా యాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ,దేశభక్తిని చాటిచెప్పే ఈ కార్యక్రమంలో యువత,మహిళలు ,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి,రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కొమురయ్య

## తల సేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం.. నిర్వహించడం అభినందనీయం

రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త,ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు



**కామారెడ్డి జిల్లా,జూలై26(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలంలోని ఎల్పుగోండ గ్రామంలో బిఆర్ఎస్ యువజన విభాగం నాయకులు గంప శశాంక్ జన్మదినం సందర్భంగా తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయం రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ...తల సేమియా వ్యాధి చిన్నారులకు ప్రతి 15రోజులకు ఒక యూనిట్ రక్తం వారి జీవితాంతం అవసరమవుతుందని,వారి ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నదని అన్నారు.రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంస పత్రాలను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షులు పర్ష వెంకటరమణ,బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంబోతుల రాజగౌడ్,యువజన విభాగం అధ్యక్షుడు పులిమామిడి దేవరాజు,సర్పంచ్ విద్యా సాగర్,ఉప సర్పంచ్ రవి,సాయి రెడ్డి,అంకం బాలకిషన్,తోట రామ్మోహన్,రామ్మూర్తి,నర్సింలు,ప్రశాంత్ రెడ్డి, భూపతి,రంజిత్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## యువత పోరాట ఫలితమే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా..

శ్రీనివాస్ రాంటెంకి



**బెల్లంపల్లి,జులై26(సూర్యరేఖ)** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా యువత చేపట్టిన ఉద్యమం ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాంటెంకి అన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ...నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని,కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా యువత పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టిందన్నారు.వేలాది మంది యువత ఉద్యమానికి మద్దతుగా నిలవడంతో కేంద్ర ప్రభుత్వం స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.యువత సంకల్పిస్తే దేశ రాజకీయాల్లోనూ మార్పులు తీసుకురాగల శక్తి ఉందని ఆయన అన్నారు.యువతపై చేసిన వ్యాఖ్యలే ఈ ఉద్యమానికి కారణమయ్యాయని పేర్కొంటూ,"యూత్ పవర్ ఈజ్ నేషన్ పవర్"అనే నినాదాన్ని ఈ ఉద్యమం మరోసారి చాటిచెప్పిందన్నారు.యువత తలచుకుంటే ఏ లక్ష్యాన్నైనా సాధించగలదని ఈ ఉద్యమం నిరూపించిందని తెలిపారు.ఇకనైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎంపీలు ప్రజా సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని శ్రీనివాస్ రాంటెంకి కోరారు.

## ఎట్టకేలకు ట్రాక్టర్ సీజ్...

యజమానిపై కేసు నమోదు

టైగర్ జోన్ ప్రాంతంలో నుండి ఇసుక రవాణాకు సహాయ పడ్డ ఓ అటవీశాఖ అధికారి..

ఓ స్థానిక రాజకీయ నాయకుని అండదండ..

ఇద్దరూ ఫారెస్ట్ అధికారుల సస్పెన్షన్...






**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,జూలై 26 (సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా,జన్నారం మండలం,కవ్వాల్ టైగర్ జోన్ ప్రాంతమైన పైడిపల్లి బీట్ లో ఓ వాగునుండి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడ్డ టిఎస్19 6675 నెంబర్ గల ట్రాక్టర్ తో పాటు జన్నారం పొనకల్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని బొంతల రాజేందర్ ను ఆదివారం మధ్యాహ్నం స్థానిక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బాబా ఖాదర్ వలీ పట్టుకొని రేంజ్ కార్యాలయానికి తరలించి ట్రాక్టరు సీజ్ చేసి రాజేందర్ పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.ఇసుక విలువ 32వేలు ఉంటుందని ఆయన తెలిపారు.గతంలో కూడా ఇతడు అక్రమంగా ఇసుక రవాణా చేసి పైడిపల్లి సిసి రోడ్డు నిర్మాణానికి ఓ రాజకీయ నాయకుడికి ఇసుకను సరఫరా చేసినట్లు అభియోగాలు ఉన్నాయి.గతంలో అక్రమ ఇసుక రవాణా చేస్తుండగా పట్టుబడినటువంటి ట్రాక్టర్ ఏపీ011960ను అప్పటి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కుమారస్వామి,సెక్షన్ ఆఫీసర్ లవన్ కుమారులు ట్రాక్టర్ ను సీజ్ చేసి రేంజ్ కార్యాలయంలో భద్రపరచగా దానిని గుట్టు చప్పుడు కాకుండా రాత్రికి రాత్రి కొంతమంది ఇతర ప్రాంతానికి ఆ వాహనాన్ని తరలించగా విధుల్లో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణాలు ఎదురుకుంటూ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్,ఓ సెక్షన్ ఆఫీసర్ సస్పెన్షన్ కు గురైన విషయం తెలిసిందే..అతనిపై నిఘా ఉంచిన స్థానిక ఎఫ్ డిఓ రామ్మోహన్రావు ఆదేశాల మేరకు ఇందన్ పెల్లి ఇంచార్జ్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, జన్నారం స్థానిక రేంజ్ ఆఫీసర్ బాబా ఖాదర్ వలీ టాస్క్ నిర్వహించి అక్రమ ఇసుక రవానకు పాల్పడుతున్న ట్రక్టర్ సిజ్ చేసి బొంతల రాజుపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.


## ఈనెల 28,29న మిర్యాలగూడలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సమావేశాలు విజయవంతం చేయాలి..


సబ్బని రాజేంద్రప్రసాద్



**బెల్లంపల్లి,జూలై26(సూర్యరేఖ)** ఈనెల 28,29 తేదీల్లో నల్గొండ జిల్లా మిర్యాలగూడలో నిర్వహించనున్న ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్,జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్,లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ... రాష్ట్ర కమిటీ సమావేశాలకు రాష్ట్రంలోని 25జిల్లాల నుంచి సుమారు 70మంది రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరవుతారని తెలిపారు.దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన విద్యార్థి,యువజన ఉద్యమాలు,కేంద్ర విద్యా విధానం,నీట్ పరీక్షల వ్యవహారం తదితర అంశాలపై సమావేశాల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా విద్యార్థి,యువజన ఉద్యమాల ఫలితమేనని ఆయన అన్నారు.అయితే రాజీనామాతోనే సరిపెట్టకుండా కేంద్ర విద్యా విధానంపై సమగ్ర సమీక్ష చేపట్టి,నీట్ విధానాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు.నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని,ఉద్యమాల సందర్భంగా దేశవ్యాప్తంగా నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే నిర్బంధ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విద్యార్థులు,యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు.ఈ అంశాలపై రాష్ట్ర కమిటీ సమావేశాల్లో చర్చించి ప్రజా ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించి,ఐక్య పోరాటాలను నిర్మించేందుకు నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్,తోగరి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# ముంచుకొస్తున్న గడువు.. మందకొడిగా డిజిటలైజేషన్





## రాజేంద్రనగర్ జోన్‌లో 54.02శాతమే పూర్తి..

### మరో ఏడు రోజులే అవకాశం

**రాజేంద్రనగర్,జులై26(సూర్యరేఖ)** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ప్రక్రియకు గడువు సమీపిస్తున్నప్పటికీ,రాజేంద్రనగర్ జోన్ పరిధిలో ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ఆశించిన వేగంతో సాగడం లేదు.ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఆగస్టు 3వ తేదీ వరకు మాత్రమే గడువు ఉండటంతో మిగిలిన రోజుల్లో ఓటర్లు తప్పనిసరిగా ప్రక్రియ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.రాజేంద్రనగర్ జోన్ పరిధిలో మొత్తం 6,35,283 మంది ఓటర్లు ఉండగా,ఆదివారం సాయంత్రం నాటికి 3,48,877 మంది మాత్రమే డిజిటలైజేషన్ పూర్తి చేసుకున్నారు.ఇది మొత్తం ఓటర్లలో 54.02శాతానికి సమానం.ఇంకా దాదాపు సగం మంది ఓటర్లు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది.

**అత్తాపూర్ సర్కిల్ పరిధిలో...**

అత్తాపూర్ సర్కిల్ పరిధిలో మొత్తం 249 బూత్‌లు ఉన్నాయి.వాటిలో రాజేంద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములు పర్యవేక్షణలో 86 బూత్‌లు ఉండగా,1,86,303 మంది ఓటర్లు ఉన్నారు.అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి పర్యవేక్షణలో 163 బూత్‌లలో 1,07,441 మంది ఓటర్లు ఉన్నారు.ఇప్పటివరకు 97,063 మంది ఓటర్ల వివరాలు డిజిటలైజేషన్ పూర్తి చేసి 54.02శాతం నమోదు అయ్యింది.

**రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో...**

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 83 బూత్‌లు ఉండగా,98,159 మంది ఓటర్లు ఉన్నారు.ఇక్కడ ఇప్పటివరకు 53.69శాతం మంది మాత్రమే డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు.ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి సర్వర్ సమస్యలు,కొంతమంది బూత్ స్థాయి అధికారులపై పడిన అదనపు పనిభారం,ఓటర్లలో పూర్తి స్థాయి అవగాహన లేకపోవడం వంటి కారణాలతో నమోదు ప్రక్రియ మందగించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అధికారులు మాత్రం ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయడంతో పాటు,స్థానికంగా లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదిస్తూ ప్రక్రియ పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నారు.అధికారుల సూచనల మేరకు ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి,అవసరమైన గుర్తింపు పత్రాలతో బూత్ స్థాయి అధికారులకు అందజేసి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి.అవసరమైన పత్రాలు సమర్పించడంలో జాప్యం చేయకుండా,గడువు ముగిసేలోపు నమోదు పూర్తి చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు.కాబట్టి గడువు ముగిసేలోపు ప్రతి అర్హుడైన ఓటరు డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి,భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# లోకాయుక్త జోక్యంతో ప్రారంభమైన అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలా..

### ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లేఔట్‌లో బ్లాక్‌టాప్ రోడ్ల నిర్మాణంపై కాలనీవాసుల ఆందోళన

### రూ.9.60 కోట్ల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్





**ఉప్పల్,జూలై26(సూర్యరేఖ)** ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లేఔట్‌లో కొనసాగుతున్న బ్లాక్‌టాప్ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని కాలనీవాసులు,ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా కనీస మౌలిక సదుపాయాల కోసం పోరాడిన నివాసితులు,చివరకు లోకాయుక్తను ఆశ్రయించడంతో ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.కాలనీలో నెలకొన్న సమస్యలపై పలుమార్లు సంబంధిత శాఖల అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ స్పందన లేకపోవడంతో వెల్ఫేర్ అసోసియేషన్ లోకాయుక్త కోర్టును ఆశ్రయించింది.అనంతరం లోకాయుక్త ప్రతినిధులు లేఔట్‌ను సందర్శించి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి,హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులను ప్రశ్నించినట్లు అసోసియేషన్ తెలిపింది.దీంతో ప్రభుత్వం లేఔట్‌లో పలు అభివృద్ధి,పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రారంభించిందని పేర్కొంది.ఈ క్రమంలో దాదాపు10 కిలోమీటర్ల మేర బ్లాక్‌టాప్ రోడ్ల నిర్మాణానికి రూ.9.60కోట్ల నిధులు మంజూరయ్యాయి.అయితే ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని,సంబంధిత ఇంజినీరింగ్ శాఖ అధికారులు సరైన పర్యవేక్షణ చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.రోడ్లు వేసే ముందు ఉపరితలాన్ని పూర్తిగా శుభ్రం చేయకుండా,పాత రాళ్లు,కంకర,వ్యర్థాలను తొలగించకుండా బ్లాక్‌టాప్ వేస్తున్నారని వారు పేర్కొన్నారు.అవసరమైన సాంకేతిక ప్రమాణాలు పాటించడం లేదని, ముఖ్యంగా రాత్రి వేళల్లో పనులు నిర్వహించడం వల్ల నాణ్యతను పరిశీలించే అవకాశం లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.లోకాయుక్త జోక్యంతో సాధించుకున్న అభివృద్ధి పనులు కూడా నాణ్యత లేకుండా అమలు కావడం బాధాకరమని వెల్ఫేర్ అసోసియేషన్ పేర్కొంది.ప్రజాధనాన్ని వృథా కాకుండా సంబంధిత అధికారులు వెంటనే పనులను తనిఖీ చేసి,నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని, లోపభూయిష్టంగా చేసిన పనులను నిబంధనలకు అనుగుణంగా తిరిగి చేపట్టాలని డిమాండ్ చేసింది.అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని,ఉప్పల్ భగాయత్ కాలనీ అభివృద్ధి కోసం ప్రజలు చేసిన పోరాటం వృథా కాకుండా ప్రతి రూపాయి ప్రజాధనం నాణ్యమైన అభివృద్ధి పనులకే వినియోగించేలా ప్రభుత్వం,అధికారులు తక్షణమే స్పందించాలని ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్,కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు

## మన్ కీ బాత్ 136వ ఎపిసోడ్‌ను వీక్షించిన మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

### వికసిత భారత నిర్మాణంలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా ముందుకు రావాలని పిలుపు..



**రామంతాపూర్,జూలై26(సూర్యరేఖ)**రామంతాపూర్ ఇంద్రానగర్‌లోని వీఎంహెచ్ (విఎం హెచ్)స్కూల్ ఆవరణలో బీజేపీ నాయకులు,శక్తి కేంద్ర ఇంచార్జ్ శీలం సోమశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో బూత్ నెం.282 పరిధిలో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" 136వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ వీక్షించారు.ఈ సందర్భంగా ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ..."మన్ కీ బాత్" కార్యక్రమం దేశ ప్రజల్లో సేవాభావం,జాతీయ చైతన్యం, సామాజిక బాధ్యతను పెంపొందించే గొప్ప వేదిక అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతి నెలా దేశ ప్రజలతో నేరుగా మమేకమై వారి విజయగాథలు, స్ఫూర్తిదాయక అనుభవాలు,దేశాభివృద్ధికి దోహదపడే అంశాలను పంచుకోవడం ప్రతి భారతీయుడికి ప్రేరణగా నిలుస్తోందని పేర్కొన్నారు. వికసిత భారత నిర్మాణంలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు .కార్యక్రమంలో రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్ గుప్తా,బీజేపీ నాయకులు ముత్తినేని జగదీష్,రేవు నరసింహ కురుమ,వల్లపు జగన్ యాదవ్,తాళ్ల బాలకృష్ణగౌడ్, కొంపల్లి ఉపేందర్,కృష్ణమూర్తి, సంజయ్ పటేల్, రవీంద్ర రెడ్డి,పలుగుల అంజయ్యపటేల్,వెంకన్నగౌడ్, ఉపేందర్ యాదవ్,శైలేందర్,ప్రభులింగం,కొండా సతీష్ గుప్తా,తమ్మలి రవి,వెంపటి రాంరాజ్, రామబ్రహ్మం,మురళి,మహిళా నాయకురాలు కీర్తి, శక్తి కేంద్ర ఇంచార్జ్‌లు,బూత్ అధ్యక్షులు,పార్టీ కార్యకర్తలు,కుటుంబ సభ్యులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భానేష్‌కు కాంగ్రెస్ నేతల ఘన సన్మానం..



**బెల్లంపల్లి,జూలై26(సూర్యరేఖ)** మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన రామగిరి భానేష్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాతరి స్వామి మాట్లాడుతూ...మాదిగ సామాజిక వర్గానికి చెందిన రామగిరి భానేష్‌కు లభించిన ఈ బాధ్యత సామాజిక న్యాయానికి నిదర్శనమని అన్నారు. రైతుల సంక్షేమం,వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసి రైతుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు.రామగిరి భానేష్ మాట్లాడుతూ...తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతుల ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ పట్టణ అధ్యక్షుడు రామగిరి మహేష్,ఓబీసీ కో-చైర్మన్ బండి లక్ష్మణ్, నాయకులు రమాకాంత్,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫుల్ కేజీలతో రోడ్లపై తిరిగితే చర్యలు తప్పవు..

ఎస్సై రాజేష్




**నిజాంపేట,జూలై 26(సూర్యరేఖ)** మద్యం సేవించి ఫుల్ కేజీలతో రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అసౌకర్యం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నిజాంపేట ఎస్సై రాజేష్ హెచ్చరించారు.ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం,రోడ్లపై గొడవలకు పాల్పడడం,అసభ్యంగా ప్రవర్తించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు.ఇలాంటి ఘటనలు గుర్తించిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించే ఘటనలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై రాజేష్ కోరారు.

# ఏఎస్ రావునగర్‌లో ప్రారంభమైన 'వాక్య సిల్వర్' షోరూమ్..

మొదటి 50మంది వినియోగదారులకు సిల్వర్ ఆభరణాలు,వెండి వస్తువుల మేకింగ్ ఛార్జీలపై 50 శాతం ప్రత్యేక ప్రారంభరాయితీ.

ఎమ్మెల్యే ఎన్.గణేష్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం..





**ఏఎస్ రావునగర్,జులై26(సూర్యరేఖ)** ఏఎస్ రావునగర్ మెయిన్ రోడ్‌లో ప్రీమియం 92.5 స్టెర్లింగ్ సిల్వర్ ఆభరణాలు మరియు నాణ్యమైన వెండి వస్తువులకు ప్రత్యేక గుర్తింపు పొందిన 'వాక్య సిల్వర్' షోరూమ్‌ను ఎమ్మెల్యే ఎన్.గణేష్ ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...సంప్రదాయ హస్తకళను ఆధునిక డిజైన్లతో మేళవించి రూపొందించిన 92.5 స్టెర్లింగ్ సిల్వర్ ఆభరణాలు,వెండి వస్తువులను ఒకే చోట అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు.రోజువారీ వినియోగం నుంచి వివాహాలు,పండుగలు,ప్రత్యేక వేడుకలు, బహుమతుల కోసం అనువైన విభిన్న శ్రేణి ఆభరణాలు వినియోగదారులకు అందుబాటులో ఉండటం విశేషమని పేర్కొన్నారు.వాక్య సిల్వర్ యాజమాన్యం మాట్లాడుతూ...అత్యుత్తమ నాణ్యత,ఆకర్షణీయమైన ఆధునిక డిజైన్లు,హస్తకళా నైపుణ్యానికి ప్రాధాన్యతనిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని పొందడమే తమ లక్ష్యమన్నారు. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మొదటి 50 మంది వినియోగదారులకు సిల్వర్ ఆభరణాలపై 50 శాతం తగ్గింపుతో పాటు వెండి వస్తువుల మేకింగ్ ఛార్జీలపై కూడా 50 శాతం ప్రత్యేక రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు.హైదరాబాద్‌లో సిల్వర్ ఆభరణాలు,ప్రీమియం వెండి వస్తువుల కోసం విశ్వసనీయ గమ్యస్థానంగా వాక్య సిల్వర్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

# రాళ్లగూడలో వైభవంగా శ్రీ అక్కమహాంకాళి-శ్రీ బీరప్ప బోనాల మహోత్సవం..

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్



**శంషాబాద్,జులై26(సూర్యరేఖ)**శంషాబాద్ మండలంలోని రాళ్లగూడలో శ్రీఅక్క మహాంకాళి-శ్రీబీరప్ప బోనాల మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తజనంతో కిక్కిరిసిపోయాయి.డప్పు వాయిద్యాలు,పోతరాజుల విన్యాసాలు,సాంప్రదాయ నృత్యాలతో బోనాల ఊరేగింపు కన్నులపండువగా సాగింది.ఈ మహోత్సవంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పాల్గొని శ్రీఅక్కమహాంకాళి అమ్మవారు,శ్రీబీరప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.రాళ్లగూడ కురుమ సంఘం పెద్దలు,సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.సాంప్రదాయ బోనాలు సమర్పిస్తూ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించగా,యువత ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు.ఆలయంలో ప్రత్యేక అలంకరణలు,పూజా కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ...బోనాల పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే గొప్ప సాంస్కృతిక వేడుక అని అన్నారు.ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు సమాజంలో ఐక్యతను,సామరస్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ సంప్రదాయాలను పరిరక్షిస్తూ భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు.ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.భక్తుల రద్దీ దృష్ట్యా ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించగా,ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు,మహిళలు,యువతతో పాటు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# బ్యాంక్ కాలనీ పార్కులో నూతన చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్,వాచ్‌మెన్ రూమ్ పనుల పరిశీలన..




త్వరలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం: బన్నాల ప్రవీణ్ ముదిరాజ్

**చిలుకానగర్,జూలై26(సూర్యరేఖ)**బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని బ్యాంక్ కాలనీ పార్కులో నూతనంగా నిర్మిస్తున్న వాచ్‌మెన్ రూమ్, చిన్నారుల కోసం ఏర్పాటు చేస్తున్న చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్ పనులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,జీహెచ్ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్,తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ...గత మే నెలలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో వాచ్‌మెన్ రూమ్,చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు.బ్యాంక్ కాలనీ పార్కుకు చుట్టుపక్కల కాలనీల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వాకింగ్, ఓపెన్ జిమ్ వినియోగానికి వస్తుండటంతో పాటు చిన్నారులు కూడా అధికంగా వస్తున్నారని తెలిపారు.పార్కుకు వచ్చే చిన్నారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాజీ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయాలని కోరగా, ఆయన సహకారంతో నిధులు మంజూరై పనులు చేపట్టినట్లు తెలిపారు.పార్కుల్లో ఆకతాయిల సమస్యలను దృష్టిలో ఉంచుకుని భద్రతను మెరుగుపరిచేందుకు వాచ్‌మెన్‌ను నియమించడానికి ప్రత్యేకంగా వాచ్‌మెన్ రూమ్ నిర్మిస్తున్నామని చెప్పారు.ప్రస్తుతం ప్లే ఎక్విప్‌మెంట్,వాచ్‌మెన్ రూమ్ పనులు పూర్తయ్యాయని,త్వరలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. "బ్యాంక్ కాలనీ పార్క్ పెద్దలకు ఆరోగ్యం, చిన్నారులకు ఆహ్లాదాన్ని అందించే కేంద్రంగా మారుతోంది.ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి కొనసాగుతుంది"అని బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ మల్లేష్,జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆవుపేడ,మూత్రంతో జీవామృతం వినియోగించాలి..


రైతురత్నగారి మహేందర్ రెడ్డి



**నిజాంపేట,జూలై26(సూర్యరేఖ)** మండలంలోని కల్వకుంట గ్రామ రైతు రత్నగారి మహేందర్ రెడ్డి రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ దేశీ ఆవుపేడ,మూత్రంతో తయారు చేసే జీవామృతాన్ని వినియోగించాలని సూచించారు.సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరించడం ద్వారా రసాయన ఎరువులు,క్రిమిసంహారక మందుల అవసరం లేకుండానే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి,ప్రకృతిలో లభించే వ్యర్థాలతోనే పంటలను సాగు చేయడం వల్ల భూమి సారవంతం అవుతుందని చెప్పారు.జీవామృతాన్ని దేశీ ఆవు పేడ,మూత్రంతో తయారు చేసి వరి పొలాల్లో వినియోగిస్తే అది నేలలో కలిసిపోయి మొక్కలకు అవసరమైన పోషకాలను అందిస్తుందని వివరించారు .జీవామృతం వాడకం వల్ల నేలలోని సూక్ష్మజీవులు, వానపాములు విస్తృతంగా అభివృద్ధి చెందుతాయని,అవి భూమిని గుల్లగా మార్చి నేల అడుగు భాగంలోని పోషకాలను మొక్కలకు అందుబాటులోకి తీసుకువస్తాయని పేర్కొన్నారు. దీంతో నేల సారవంతం పెరిగి పంటలు ఆరోగ్యంగా ఎదిగి రైతులకు అధిక దిగుబడి లభిస్తుందని మహేందర్ రెడ్డి తెలిపారు.

## "సర్"ప్రక్రియ సాఫీగా సాగేలా సహాయ కేంద్రాలు పని చేయాలి..

కాంగ్రెస్ శ్రేణులకు మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పిలుపు



**ఉప్పల్,జూలై26(సూర్యరేఖ)** సర్ ప్రక్రియ సాఫీగా,వేగవంతంగా సాగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఉప్పల్ కురుమనగర ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి ఆదివారం పరిశీలించారు.నిజమైన ఓటర్లకు సర్ ప్రక్రియతో ఎలాంటి నష్టం లేకుండా చూడాలని ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నారు.బీఎల్ఓతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లింగంపల్లి రామకృష్ణ,సల్ల ప్రభాకర్ రెడ్డి,దుర్గం నవీన్ యాదవ్,గోవింద్ కుమార్ స్వామి,సందీప్,పి రామచందర్,గోవిందు,టి.మల్లేష్,మధు,అక్కు రవి, టి.శ్రీనివాస్ రెడ్డి,టి.విజయ సింగ్,సత్యనారాయణ చారి,రాజ్ కుమార్,రాజయ్యగౌడ్, గోవింద్ కొమరయ్య మంగ శీను,పి.మహేందర్ , కుమార్,పూల చందు,విమల్ బాలుయాదవ్,రమేష్ యాదవ్,కే.బీరయ్య,సతీష్ కుమార్, బిఎల్ఓ337, 338,దుర్గం రేణుక,ఎల్. అరుణ మరియు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## గిరిపురం రైతు వేదికలో మూడు రోజుల విత్తన మేళా..

అందుబాటులో పెసర,కంది,మినుము,వేరుశెనగ విత్తనాలు..

రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

మండల వ్యవసాయ అధికారి బోడ వీరాసింగ్



**మరిపెడ,జూలై26(సూర్యరేఖ)**వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మరిపెడ మండలంలోని గిరిపురం రైతు వేదికలో ఈనెల 27 నుంచి 29వరకు మూడు రోజుల పాటు విత్తన మేళా నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి బోడ వీరాసింగ్ ఆదివారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తక్కువ నీటితో సాగు చేయడానికి అనువైన ఆరుతడి పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు ఆయన వెల్లడించారు.విత్తన మేళాలో పెసర,కంది,మినుము,వేరుశెనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా రైతులు నాణ్యమైన విత్తనాలను పొందడంతో పాటు పంటల ఎంపిక,సాగు యాజమాన్యం,వర్షాభావ పరిస్థితుల్లో అనుసరించాల్సిన శాస్త్రీయ సాగు విధానాలపై వ్యవసాయశాఖ అధికారుల నుంచి అవగాహన పొందాలని సూచించారు.గిరిపురం రైతు వేదికలో నిర్వహించే ఈ విత్తన మేళాను రైతులు,అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి బోడ వీరాసింగ్ కోరారు.

## ఏకలవ్యుని విద్య, వినయం, క్రమశిక్షణ, సమానత్వం అనే విలువలతో సమాజ అభివృద్ధికి పాటుపడదాం..

కేంసారం సరళ..



**నాంపల్లి,హైదరాబాద్,జూలై26(సూర్యరేఖ)** ఏకలవ్యుని ఆశయాలను స్మరిస్తూ,విద్య,వినయం, క్రమశిక్షణ,సమానత్వం అనే విలువలతో సమాజ అభివృద్ధికి పాటుపడదామని కేంసారం సరళ అన్నారు.ఈ సందర్భంగా లంగర్ హౌస్ డివిజన్ పరిధిలోని ప్రాంతంలో బీజేపీ మహిళ మోర్చ లంగర్ హౌజ్ అధ్యక్షురాలు కేంసారం సరళ ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి లోకిని రాజు,కూతడి రవికుమార్,రాష్ట ఎరుకల ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీరామ్ సదానందం,శ్రీరామ్ ఆనంద్,పివి రమణ,జాతీయ అధ్యక్షులు దేవరాజు యాదగిరి,రాష్ట్ర ఉపాధ్యక్షులు కెంసారం నాగులు,ఉపాధ్యక్షులు వనం అశోక్,రాష్ట సహాయ కార్యదర్శి నారాయణ,జిల్లా అధ్యక్షులు పాతపల్లి నరసింహ సాయి,రాష్ట సహాయ కార్యదర్శి దేవరాయ యాదగిరి,రాష్ట అడ్వైజర్ బాణాపురం శ్రీరాములు,రాష్ట అడ్వైజర్ మదుగని ఎల్లయ్య,మొగలయ్య ఎగ్జిక్యూటివ్ మెంబర్,కేంసారం ధర్మరాజు శ్రీరామ్ శివానందం కిరణ్,బాలనగర్ మాజీ కార్పొరేటర్ తండూరి నరేంద్రచారి,మాధవగాని కృష్ణా,చోళంకి పల్లి దుర్గాప్రసాద్,కూరాకుల రాము,కట్టగంగా ప్రసాద్ లు పాల్గొని ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి అయన గురుభక్తికి,అంకిత భావానికి,ఆత్మవిశ్వాసానికి, పట్టుదలకు ప్రతీకగా నిలిచిన మహనీయుడు ఏకలవ్యుడు జీవిత చరిత్రను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా కేంసారం సరళ మాట్లాడుతూ...ఆయన జీవితం మనకు కష్టపడే తత్వాన్ని,లక్ష్యసాధన కోసం అచంచల సంకల్పంతో ముందుకు సాగాలనే స్ఫూర్తిని ప్రతి ఒక్కరికి అందిస్తుందన్నారు.ఈ పవిత్రమైన ఏకలవ్య జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను స్మరిస్తూ,విద్య,వినయం,క్రమశిక్షణ,సమానత్వం అనే విలువలను ఆచరిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరం కృషి చేద్దాం అని కేంసారం సరళ పిలుపు నిచ్చారు.

## మేడ్చల్ డిపోలో భక్తిశ్రద్ధలతో ఆషాడ మాస బోనాల మహోత్సవం..



**మేడ్చల్,జూలై26(సూర్యరేఖ)**మేడ్చల్ ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో ఆషాడ మాస బోనాల మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఏడుగుళ్ల ఆలయంలో అమ్మవారికి సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు.ఈ వేడుకలో డిపో అధికారులు,ఉద్యోగులు,డ్రైవర్లు,కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది,ఔట్‌సోర్సింగ్ సిబ్బంది,వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డిపోలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.అమ్మవారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలకు సుఖశాంతులు, సమృద్ధి,ఆయురారోగ్యాలు కలగాలని,డిపో సిబ్బంది అందరూ క్షేమంగా ఉండాలని ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రార్థించారు.కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

## ఎస్.ఐ.ఆర్ ఎన్యూమరేషన్ ఫారమ్ పంపిణీ..

ఓటర్ల అవగాహన కార్యక్రమం..



**సికింద్రాబాద్,జూలై26(సూర్యరేఖ)**వారాసిగూడ షాహ్‌బాజ్‌గూడ ప్రాంతంలోని బూత్ నెం.57లో ఎస్.ఐ.ఆర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను ఇంటింటికీ పంపిణీ చేశారు.సయ్యద్ సద్దాం ఆధ్వర్యంలో సంబంధిత బిఎల్ఓ విజయ్ కుమార్,జి.చంద్రశేఖర్,మరిపల్లి రవి,లతో కలిసి పాల్గొన్నారు.ఈసందర్భంగా ఓటర్లకు ఎస్.ఐ.ఆర్ ఫారమ్‌లను ప్రజలకు ఎలా సరిగ్గా పూరించాలి,ఎలా సమర్పించాలి అనే విషయాలపై అవగాహన కల్పించాను.అలాగే ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ప్రాముఖ్యతను వివరించి,ప్రతి ఓటరు తమ వివరాలను ఖచ్చితంగా, సరైన సమాచారంతో ఫారమ్‌లో నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలోజి.ఎస్.ఆర్ టీమ్ సభ్యులు,బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాచారం మహాకాళి ఆలయంలో ప్రధాన అర్చకులు వేదాంతం నరసింహమూర్తి సేవలకు అర్ధశతాబ్ది వేడుకలు

విశేష అన్నప్రసాద వితరణ..అర్చకులకు ఘన సత్కారం



**నాచారం,జూలై26(సూర్యరేఖ)** నాచారం శ్రీమహాకాళి సమేత మహాకాళేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీవేదాంతం నరసింహమూర్తి ఆలయంలో నిరంతరాయంగా 50 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవల అర్ధశతాబ్ది మహోత్సవాలలో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో విశేషంగా బృహత్ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం నరసింహమూర్తిని శాలువాతో ఘనంగా సత్కరించి,వారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా భక్తులు అర్చకులు వేదాంతం నరసింహమూర్తి ఆలయానికి ఐదు దశాబ్దాలుగా అందిస్తున్న విశిష్ట సేవలను కొనియాడుతూ, భవిష్యత్తులోనూ వారి సేవలు ఇదే విధంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అర్చకులు వేదాంతం నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బృహత్ అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్,కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్ రెడ్డి,పోగుల రమణారెడ్డి,గద్ద యుగేందర్,హరినాథ్ రెడ్డి,ఇంద్రాల స్వామి, నూతనగంటి రాజు,మోర నరసింహారెడ్డి, బాలరాజ్,ప్రతాప్ రెడ్డి,గుండు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ ఫ్లైఓవర్ పనులు వెంటనే పునఃప్రారంభించాలి..

ఎంపీ ఈటెల రాజేందర్‌కు బీఆర్ఎస్ వినతి



**మేడ్చల్,జూలై26(సూర్యరేఖ)** మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారి-44పై నిలిచిపోయిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను తక్షణమే పునఃప్రారంభించాలని కోరుతూ మేడ్చల్ మాజీ కౌన్సిలర్ ఉమానాగరాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్,కు ఆదివారం వినతిపత్రం అందజేశారు.మేడ్చల్ ఎన్‌హెచ్-44పై ఫ్లైఓవర్ పనులు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.ముఖ్యంగా మేడ్చల్ చెక్‌పోస్ట్ నుంచి అత్వెల్లి వరకు జాతీయ రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి,తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, దెబ్బతిన్న రహదారి కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలను ప్రస్తావించారు. అందువల్ల సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేసి,ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు మేడ్చల్ చెక్‌పోస్ట్ నుంచి అత్వెల్లి వరకు నూతన రహదారి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగరాజు ముదిరాజ్, లాయక్ అలీ,బాలరాజ్ ముదిరాజ్,బాలమల్లేష్ యాదవ్,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జడ్జి..



**బెల్లంపల్లి,జూలై26(సూర్యరేఖ)** మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాలను బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శాంతి సోని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలోని వంటశాల, స్టోర్‌రూమ్‌ను పరిశీలించి ఆహార పదార్థాలను పరిశుభ్రంగా నిల్వ ఉంచాలని,వంటలను నాణ్యతతో,పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు.అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే నాణ్యమైన,పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థినులకు అందించాలని గురుకుల ఇన్‌చార్జికి ఆదేశాలు జారీ చేశారు.పాఠశాలలో పరిశుభ్రత, విద్యార్థినుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

## హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 1లో సర్ హెల్ప్ డెస్క్..

హబ్సిగూడ డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు..



**హబ్సిగూడ,జూలై26(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం హబ్సిగూడ స్ట్రీట్ నంబర్-1లో ఏర్పాటు చేసిన సర్ హెల్ప్ డెస్క్ ను డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి సందర్శించారు.ఈ హెల్ప్ డెస్క్ ను డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు .ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కుని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని, సర్ ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.బీఎల్వోలు, కాంగ్రెస్ బీఎల్ఏలు ఇంటింటికీ తిరిగి ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో ఓటర్లకు సహాయం చేయాలని,ఇప్పటికే నింపిన ఫారాలను కలెక్ట్ చేసుకోవాలని సూచించారు.స్వయంగా ఆయనే పలువురి ఎన్యూమరేషన్ ఫారాలను ఫిల్ చేశారు. బూత్ ల వారీగా సర్ పురోగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ మాజీ డివిజన్ ప్రెసిడెంట్ గన్నారం విజయ్ కుమార్,సీనియర్ నాయకులు చింతల బాబురావు,మురళీ కృష్ణ ముదిరాజ్,రాజునాయక్,మాలునాయక్,గుండు రాజన్న,గంగా యాదవ్, ధర్మ రాజు,రాము,యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వాసునాయక్, లక్ష్మీనారాయణ, కుమార్,సాయి కుమార్,సాయికిరణ్,సుమన్ నాయక్,మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలి..

సీఐటీయూ



**మందమర్రి,జూలై26(సూర్యరేఖ)** అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు బదిలీ అయిన సింగరేణి కార్మికులకు బేసిక్,గ్రేడ్‌లలో జరిగిన నష్టాన్ని హైకోర్టు తీర్పు మేరకు వెంటనే సరిచేసి,బకాయిలను చెల్లించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ)నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం మందమర్రిలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు మంద నరసింహారావు,ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ...కిష్టారం ఓసీ, భూపాలపల్లి ఏరియాలకు చెందిన 23మంది కార్మికుల తరపున హైకోర్టులో దాఖలైన కేసులో కార్మికులకు అనుకూలంగా తీర్పు రావడం హర్షణీయమన్నారు.ఐదేళ్ల న్యాయపోరాటం అనంతరం వచ్చిన ఈ తీర్పులో కార్మికుల బేసిక్, గ్రేడ్ నష్టాన్ని సవరించి,సంబంధిత ఏరియర్లను మూడు నెలల్లో చెల్లించాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు.ఈ తీర్పును కేవలం కేసు వేసిన కార్మికులకే పరిమితం చేయకుండా,2017తర్వాత అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు బదిలీ అయిన అర్హులైన అందరికీ వర్తింపజేయాలని వారు కోరారు. ఇందుకోసం అన్ని బ్రాంచ్‌ల నాయకులు కార్మికులతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.కోల్ ఇండియాలో ఇలాంటి పరిస్థితి లేకపోయినా,సింగరేణిలో మాత్రం ఈ సమస్య కొనసాగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి రాజేందర్,బ్రాంచ్ అధ్యక్షుడు ఎస.వెంకటస్వామి, నాయకులు జడల ప్రవీణ్,లింగాల సత్యనారాయణ, బుద్దె సురేష్,బాసబోయిన కుమారస్వామి, చైతన్యరెడ్డి,రేగుల శ్రీనివాస్, కలువల శ్రీనివాస్‌తో పాటు వివిధ గనులకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

## ఐటీసీ (బింగో) లక్కీడ్రా విజేతలకు బండి రాము శుభాకాంక్షలు



**బెల్లంపల్లి,జులై26(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలో ఐటీసీ(బింగో) కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్కీడ్రా కార్యక్రమంలో విప్రో కన్స్యూమర్ కేర్ (సంతూర్)డిస్ట్రిబ్యూటర్స్ ప్రొప్రైటర్డకాంగ్రెస్ నాయకులు బండి రాము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధుల ఆహ్వానం మేరకు ఆయన లక్కీడ్రా కూపన్‌ను తీశారు.అనంతరం బండి రాము మాట్లాడుతూ...లక్కీడ్రాలో బహుమతులు గెలుచుకున్న విజేతల ందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.వినియోగదారు లకు ప్రోత్సాహకంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఐటీసీ (బింగో)కంపెనీ ప్రతినిధులను ఆయన అభినందించారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23,
Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# తెలంగాణ భవన,ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆవిర్భావ సభకు భారీగా తరలిన కార్వాన్ నేతలు..

**నాంపల్లి,హైదరాబాద్,జూలై26(సూర్యరేఖ)** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ఆ పార్టీ అనుబంధ తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆవిర్భావ సభ ఆదివారం బంజారాహిల్స్లోని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.కార్వాన్ నియోజకవర్గం నుంచి తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకుడు వరికుప్పల గంగాధర్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో ఈ సభకు హాజరయ్యారు.ఈ సందర్భంగా వరికుప్పల గంగాధర్ మాట్లాడుతూ...ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఎల్.రూప్ సింగ్.ముఖ్యఅతిథిగా దేవళ్ల వీరన్న హాజరయ్యారు.ఈ సందర్భంగా దేవళ్ల వీరన్న మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులను సంఘటితం చేసి,వారి హక్కులు, సంక్షేమం,సామాజిక భద్రత కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు.కార్మికుల సంక్షేమమే సంఘం ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారన్నారు. అనంతరం సంఘం నూతన రాష్ట్ర కమిటీని ప్రకటించారు.రాష్ట్ర అధ్యక్షుడిగా ఎత్తరి గణేష్ను ఎన్నుకొని 15మంది సభ్యులతో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు ఎత్తరి మారయ్య,తో



పాటు కార్వాన్ నియోజకవర్గ కార్మిక సంఘం నాయకులు ఎస్.వెంకట్రావు,పి.సుందర్రావు,డి.పోలనాయుడు,పి.రామారావు,ఆర్.రాము, టీ.చలపతి,వై. వెంకట్రావు,కే.రాము,ఎన్.సింహాచలం,పి. అప్పలస్వామి,టీ. అప్పారావు,ఎస్.రమణయ్య,జె. ఎర్రబాబుతో పాటు తెలంగాణ రక్షణ సేన నాయకులు,కార్మిక సంఘం ప్రతినిధులు,భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోల్కొండ బోనాల జాతరలోతొట్టెల ఊరేగింపు..





### పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

**రాజేంద్రనగర్,జులై26(సూర్యరేఖ)** తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహిస్తున్న బోనాల జాతరలో భాగంగా గోల్కొండలో జరిగిన తొట్టెల ఊరేగింపు ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా సాగింది.గోల్కొండ బంజారా దర్వాజా సమీపంలోని హనుమాన్ మందిర్ ప్రాంగణంలో కళా సిండికేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.మాజీ కౌన్సిలర్ మక్తాల కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తొట్టెల ఊరేగింపు,సాంప్రదాయ పూజలు,డప్పు వాయిద్యాలు,పోతరాజుల విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలు సమర్పించగా,యువత ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ...బోనాల పండుగ తెలంగాణ ఆధ్యాత్మికతకు,సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని అన్నారు.ఇలాంటి పండుగలు ప్రజల్లో ఐక్యత,సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ,ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాఘవ్,రాహుల్,ఎల్.ఎన్.ఆర్, వరుణ్‌తేజ్‌తో పాటు నిర్వాహకులు, స్థానిక నాయకులు,ప్రజాప్రతినిధులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

# “బతికినన్నాళ్లు నా పాట ఉంటుంది”..

### రచయిత మన్నె మహాత్మారావు ముదిరాజ్

### తెలంగాణ బోనాల జాతర-2026జానపద సాంస్కృతిక గానతోరణం పుస్తకావిష్కరణ..

**రాజేంద్రనగర్,జులై26(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ప్రముఖ కవి,రచయిత,నంది అవార్డు గ్రహీత మన్నె మహాత్మారావు ముదిరాజ్ రచించిన “తెలంగాణ బోనాల జాతర-2026జానపద సాంస్కృతిక గానతోరణం”పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రచయిత మన్నె మహాత్మారావు ముదిరాజ్ మాట్లాడుతూ...”బతికినన్నాళ్లు నా పాట ఉంటుంది.నేను జీవించి ఉన్నంతకాలం ప్రజల కోసం,తెలంగాణ సంస్కృతి కోసం పాటలు రాస్తూనే ఉంటాను”అని అన్నారు.ఇప్పటివరకు 15పుస్తకాలు రచించానని,త్వరలో మరిన్ని గ్రంథాలను పాఠకుల ముందుకు తీసుకొస్తానని తెలిపారు.తెలంగాణ జానపద సంప్రదాయాలు,భక్తి సాహిత్యాన్ని భావితరాలకు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.గౌతమ్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ బి.బాలరాజ్ ముదిరాజ్ గురుస్వామి ఈ పుస్తకాన్ని ప్రచురించారు.ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ వైద్యులు,సాధన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ...మన్నె మహాత్మారావు రచనలు తెలంగాణ జానపద సాహిత్యానికి విలువైన సంపదగా నిలుస్తాయని కొనియాడారు.సీనియర్ మహిళా నాయకురాలు యాదమ్మ మాట్లాడుతూ.. .మన్నె మహాత్మారావు సమాజానికి ఆదర్శప్రాయుడని,ఆయన రచించే



పాటలు,భజనలు భక్తి భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు.ఆయన అడుగుజాడల్లో నడవడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ అమరేందర్,సీపీఐ నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు,నరసింహారెడ్డి,విద్యార్థి సంఘం నాయకుడు రామకృష్ణ,జహీరాబాద్ ఎమ్మార్వో కృష్ణ,ఉత్తంకుమార్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు సతీష్,కిస్మత్‌పూర్ గ్రామానికి చెందిన ఎస్.స్వామి,ప్రముఖ కవి,రచయిత,కళాకారుడు దుబ్బాకుల కృష్ణస్వామి,బుద్వేల్ భూషణం,మన్నె మహాత్మారావు శిష్యబృందం,మహిళలు,సాహితీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మెరు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సామూహిక వనభోజనాలు..

**మరిపెడ,జూలై26(సూర్యరేఖ)** మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని మెరు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక వనభోజనాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు,మహిళలు,యువత, చిన్నారులు,బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆత్మీయ వాతావరణంలో సందడి చేశారు.ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం అందరూ కలిసి వనభోజనాలు నిర్వహించడం సంఘ సంప్రదాయంగా కొనసాగుతోందన్నారు.ప్రకృతి ఒడిలో కుటుంబ సభ్యులతో కలిసి గడపడం ద్వారా పరస్పర అనుబంధాలు మరింత బలపడతాయని, వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు మంచి పంటలు పండాలని ప్రత్యేకప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు.ఇలాంటి కార్యక్రమాలు సభ్యుల మధ్య స్నేహభావం,ఐక్యత, పరస్పరసహకారాన్నిపెంపొందించడంతో పాటు



సంఘ బలోపేతానికి దోహదపడతాయని సంఘ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెరు సంఘం అధ్యక్షులు కీర్తిని నర్సింగరావు, ఉపాధ్యక్షులు నందగిరి రాజేష్,ప్రధాన కార్యదర్శి వెన్ను సాగర్,కోశాధికారి నందగిరి,గౌరవ సలహాదారులు వెన్ను ఉపేందర్,రామగిరి సత్యనారాయణ, గుంటి రవితో పాటు మహిళలు,యువకులు, చిన్నారులు,సంఘ సభ్యులు,బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం అందరూ కలిసి వనభోజనాలను ఆస్వాదిస్తూ ఆహ్లాదకరంగా గడిపారు.

## కీ,శేలు స్వర్గీయ జక్కంపూడి కృష్ణమూర్తి,కీ,శేలు ప్రేమలత రెండో వర్ధంతి..

### రక్తదాన శిబిరం హెల్త్ క్యాంప్ ప్రారంభించిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే,





**ఖమ్మం,జులై26(సూర్యరేఖ)** తల్లాడ మండలం బిల్లిపాడు గ్రామం సీనియర్ నాయకులు. కీ,శేలు స్వర్గీయ జక్కంపూడి కృష్ణమూర్తి ,కీ,శేలు ప్రేమలత 2వ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు కాంగ్రెస్ నాయకులు జక్కంపూడి కిషోర్ ఆధ్వర్యంలో బిల్లిపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం,ఉచిత హెల్త్ క్యాంప్ కార్యక్రమంను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిదయానంద్,తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జక్కంపూడి కుటుంబ సభ్యులు ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలకు వారిని ప్రత్యేకంగా అభినందించారు.కీ,శే జక్కంపూడి కృష్ణమూర్తి దంపతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం బిల్లిపాడు గ్రామంలో కీ “శే “లు బేగ్ అల్లిబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## నారాయణఖేడ్ లో ఎస్.ఐ.ఆర్.బ్రహ్మాండంగా సాగుతోంది..

### ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**నారాయణఖేడ్,జులై27(సూర్యరేఖ)** నియోజకవర్గంలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ-ఎస్.ఐ.ఆర్.ప్రక్రియపై ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి క్యాంపు కార్యాలయంలో బి.ఎల్.ఏలతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి, ఎస్.ఐ.ఆర్. ఇంచార్జ్ ఎం.ఎ.ఫహీం,లు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ... నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమం బ్రహ్మాండంగా జరుగుతోందన్నారు. ఇప్పటివరకు 90శాతం ప్రక్రియ పూర్తయిందని, మరికొంత కృషితో 100శాతం లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు.ప్రతి బి.ఎల్.ఏ తమ తమ గ్రామాల్లో ఓటర్ జాబితా ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాగల్‌గిద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షులు విఠల్ రావు పాటిల్,అన్ని మండలాల బి.ఎల్.ఏలు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిలుకానగర్--బొడుప్పల్ ప్రధాన రహదారిపై గుంతలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

### వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు డిమాండ్



**చిలుకానగర్,జూలై26(సూర్యరేఖ)** చిలుకానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శేఖర్ మాస ఆధ్వర్యంలో చిలుకానగర్ నుంచి బొడుప్పల్ వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతలను స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా శేఖర్ మాస మాట్లాడుతూ...ఈ రహదారిపై ప్రతిరోజూ వేలాది మంది వాహనదారు లు,పాదచారులు ప్రయాణిస్తున్నందున గుంతల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చి,రహదారికి మరమ్మతులు చేపట్టి సురక్షితమైన రాకపోకలు కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని పేర్కొంటూ,ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అబుభాయ్, నక్కసుందర్, భైల్క మహేందర్,అవినాష్ యాదవ్,శ్యామ్,ఎర్ర నరేష్,బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాలు ఘనంగా జరుపుకొందాం..

మిత్ర కృష్ణ



**నాంపల్లి,హైదరాబాద్,జూలై26(సూర్యరేఖ)** హైదరాబాద్లోని చారిత్రాత్మక కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాలు అత్యంత వైభవంగా జరుగడం ఆనవాయితీ. ఈ వేడుకల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు,బోనాల సమర్పణ మరియు ఘటాల ఊరేగింపు ప్రధాన ఘట్టాలుగా ఉంటాయి.రాష్ట్ర మంత్రులు,ప్రజాప్రతినిధులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.ఈ సందర్భంగా కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో బోనాలు 2026 సంవత్సరం బౌచర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మిత్ర అసోసియేట్స్ ఛైర్మెన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులూ మిత్ర కృష్ణ పాల్గొని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మిత్ర మాలాడుతూ.. ఆగస్ట్ 9ఆదివారం తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు ప్రారంభమవుతాయని,అర్ధరాత్రి వరకు అమ్మవారి దర్శనాలు ఉంటాయని,అందుకోసం భారీ ఏర్పాట్లు కూడా చేసినట్లు డీసీపీ పేర్కొన్నారు. అంతేకాకుండా సోమవారం ఉదయం రంగం,బలి గంప,పోతురాజుల విన్యాసాలు కూడా ఉంటాయని,సాయింత్రం భారీ తొట్టెలను నిమజ్జనం చేసేందుకు ఊరేగింపుగా గణేష్ ఘాట్ మూసీ నది వరకు కొనసాగుతుందని ఆయన వెల్లడించారు.కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయ బోనాల ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారని,అందుకోసం పోలీస్ సిబ్బందిని భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు,ఈ బోనాల ఉత్సవాల్లో బోనాలు ఎత్తుకుని వచ్చే మహిళలకు కూడా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయనునట్లు పేర్కొన్నారు.


## బ్రాహ్మణ సంఘం పటిష్టతకు అందరూ కృషి చేయాలి..

జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సలాక రాజేశ్వర శర్మ పిలుపు..

తూప్రాన్ డివిజన్ అధ్యక్షుడిగా ఆత్రేయశర్మ

ఏకగ్రీవంగా మొత్తం కార్యవర్గం..

ఎన్నికల అధికారిగా వ్యవహరించిన డి.జి.శ్రీనివాస శర్మ





**రామాయంపేట,జూలై26 (సూర్యరేఖ)** బ్రాహ్మణ సంఘం పటిష్టత కోసం సభ్యులందరూ కృషి చేయాలని,నూతనంగా ఎన్నికల సభ్యులు క్రమశిక్షణతో ఉంటూ,సంఘ నియమాలను పాటిస్తూ, విరివిగా కార్యకలాపాలు కొనసాగించాలని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సలాక రాజేశ్వరశర్మ తెలిపారు.ఆదివారం తూప్రాన్ పట్టణంలోని తూప్రాన్ డివిజన్ బ్రాహ్మణ సంఘం సమావేశం,ఎన్నికలను నిర్వహించారు.ఎన్నికల అధికారిగా రామాయంపేటకు చెందిన డి.జి.శ్రీనివాసశర్మ, సహాయ ఎన్నికల అధికారిగా దేశ రాజు,రమేష్ బాబు వ్యవహరించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజేశ్వరశర్మ మాట్లాడుతూ.. .బ్రాహ్మణ సంఘం తూప్రాన్ డివిజన్ ఎన్నికలను ఏకగ్రీవంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.జిల్లా అధ్యక్షుడిగా తాను సంఘ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తున్నట్లు తెలిపారు.సమావేశంలో కార్యవర్గ మొత్తం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.తూప్రాన్ డివిజన్ బ్రాహ్మణ సంఘ అధ్యక్షులుగా శ్రీమాన్ శలాక ఆత్రేయశర్మ, ప్రధానకార్యదర్శి శ్రీమాన్ కాసుల సాత్విక్ శర్మ, కోశాధికారి శ్రీమాన్ తీర్థాల రామకృష్ణశర్మ,ను సభ్యులందరికీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .మిగతా పోస్టులను కూడా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.తూప్రాన్ డివిజన్లో ఉన్న అన్ని మండలాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించినట్లు జిల్లా అధ్యక్షుడు రాజేశ్వరశర్మ తెలిపారు.పదవులు పొందిన వారందరికీ ఎన్నికల అధికారి డి.జి.శ్రీనివాస శర్మ,సహాయ ఎన్నికల అధికారి దేశరాజు రమేష్ బాబు,జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర శర్మ, సీనియర్ నాయకులు, మున్సిపల్ కమిషనర్ అయిన వెంకటగోపాల్,సోమయాజుల రవీందర్ శర్మ చేతుల మీదుగా ధ్రువపత్రంలను అందించారు.

# పనిమనుషుల నియామకంలో నిర్లక్ష్యం తగదు..రెండేళ్లలో 565సర్వెంట్ థెఫ్ట్ కేసులు నమోదు

యజమానుల అజాగ్రత్తే నేరగాళ్లకు ఆసరా,తప్పనిసరిగా పోలీస్ వెరిఫికేషన్ చేయించుకోవాలి..



**నాంపల్లి,హైదరాబాద్,జూలై26(సూర్యరేఖ)** హైదరాబాద్ సిటీలో పనిమనుషుల దొంగతనాలు పెరుగుతుండటంతో హైదరాబాద్ సిటీ పోలీస్ యంత్రాంగం ప్రజలను తీవ్రంగా అప్రమత్తం చేస్తోంది.పనిమనుషులను చేర్చుకునేటప్పుడు యజమానులు చూపే నిర్లక్ష్యమే ఈ దొంగతనాలకు ప్రధాన కారణమని చెబుతోంది.తగిన విచారణ లేకుండా పనిలో కుదుర్చుకుంటే విలువైన సొత్తును పోగొట్టుకోవాల్సివస్తుందని హెచ్చరిస్తోంది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పనుల ఒత్తిడిలో ఉండే ఐటీ ఉద్యోగులు,ఒంటరిగా నివాసముండే విద్యార్థులు,వృద్ధులే ఈ చోరీలకు ప్రధాన బాధితులుగా మారుతున్నారు.ఇళ్లు, ఆఫీసులు,దుకాణాల్లో బంగారం,నగదు,అత్యంత విలువైన వస్తువులను నిర్లక్ష్యంగా బయట పడేసి వెళ్లడాన్ని గమనిస్తున్న కొందరు పనిమనుషులు సమయం చూసి చేతివాటం ప్రదర్శిస్తున్నారు.యజమానులు చూపే ఈ చిన్నపాటి అలసత్వమే నేరగాళ్లకు వరంగా మారుతోందని పోలీసులు విశ్లేషిస్తున్నారు.దొంగతనం జరిగిన తర్వాత దర్యాప్తు చేసి పట్టుకోవడం కంటే,అసలు నేరమే జరగకుండా ఆపడమే అత్యంత ముఖ్యమని భావిస్తున్నారు. ఇందులో భాగంగా స్వయంగా కాలనీలు, అపార్ట్మెంట్లు,గేటెడ్ కమ్యూనిటీలు,ఆఫీస్లు, దుకాణాలకు వెళ్లి యజమానులను నేరుగా కలిసి అవగాహన కల్పిస్తున్నారు.గత రెండేళ్లలో నగరంలో నమోదైన 565పనిమనుషుల దొంగతనం కేసులను 65గ్రేవ్ కేసులు,500నాన్ గ్రేవ్ కేసులు నమోదైనావన్న పోలీసులు ప్రతి యజమాని తక్షణమే భద్రతా నియమాలు పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.జోన్ల వారీగా పరిణామాలు పరిశీలిస్తే ఐటీ సంస్థలు,వ్యాపార వర్గాలు,ఉన్నత నివాస ప్రాంగణాలు,ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని ఆఫీసుల్లో,దుకాణాల్లో,ఇళ్లలో యజమానులు బిజీ జీవనశైలి కారణంగా తగిన ముందస్తు తనిఖీలు లేకుండా పనిమనుషులను చేర్చుకుంటున్నట్లు తేలింది.మొత్తం 565కేసుల్లో. .జూబ్లీహిల్స్ జోన్లో అత్యధికంగా 173కేసులు నమోదు కాగా, సికింద్రాబాద్ జోన్లో 88,ఖైరతాబాద్ జోన్లో 77,గొల్కొండ జోన్లో 70,రాజేంద్రనగర్ జోన్లో 63,శంషాబాద్ జోన్లో49,చార్మినార్ జోన్లో 45కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా ఇటీవల ఇతర దేశాలు,రాష్ట్రాల మూలాలున్న ముఠాలు పనిమనుషుల అవతారంలో ఇళ్లలోకి ప్రవేశించి పథకం ప్రకారం దొంగతనాలకు,నేరాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి.ఈ నేపథ్యంలో తగిన గుర్తింపు,పోలీస్ వెరిఫికేషన్ పత్రాలు లేని అపరిచిత వ్యక్తులను పనిలో చేర్చుకోవద్దని పోలీసు యంత్రాంగం స్పష్టంగా సూచిస్తోంది.నమ్మకంగా పనిలో చేరిన కొత్తలో యజమానుల అలవాట్లు,తాళాలు ఉంచే ప్రదేశాలు,సీసీ కెమెరాల కదలికలు, నగదు-నగల వివరాలను గమనించి నేరాలకు పాల్పడుతున్నందున ,పూర్వాపరాలు తెలియని వారిని ఇళ్లు,ఆఫీసులు,దుకాణాలకు రానివ్వకపోవ డమే శ్రేయస్కరమని స్పష్టం చేస్తున్నారు.ఇళ్లు,ఆఫీస్,దుకాణాల్లోని లోపలి సమాచారం సురక్షితంగా ఉన్నంత వరకు నేరాలకు తావుండదనే ప్రాథమిక సూత్రాన్ని ప్రతి నగరవాసి గుర్తించి అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు.

**పాటించాల్సిన భద్రతా మార్గదర్శకాలు..**

ప్రజా భద్రతను పటిష్ఠం చేసే క్రమంలో సిటీ పోలీస్ యంత్రాంగం పలు ముఖ్యమైన సూచనలను ప్రజల ముందుకు తెచ్చింది.ఎవరినైనా ఇంట్లో,ఆఫీసుల్లో,
దుకాణాల్లో పనికి కుదుర్చుకునే ముందే వారి ఆధార్ కార్డు లేదా చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు నకలు,తాజా ఫోటో,శాశ్వత చిరునామా,స్వగ్రామం వివరాలు,ఫోన్ నంబర్లు సేకరించాలని సూచిస్తోంది.ప్రైవేట్ ఏజెన్సీలు లేదా మధ్యవర్తుల ద్వారా నియామకాలు చేసుకునేటప్పుడు,సదరు ఏజెన్సీకి ప్రభుత్వ గుర్తింపు ఉందో లేదో సరిచూసుకోవాలని,గతంలో వారు ఎక్కడ పనిచేశారో ఆ యజమానులను సంప్రదించి వివరాలు ధ్రువీకరించుకోవాలని పేర్కొంటోంది.నియామకానికి ముందే స్థానిక పోలీస్ స్టేషన్లో ఉచితంగా లభించే 'పోలీస్ వెరిఫికేషన్' చేయించుకోవడం భద్రతా పరంగా శ్రేయస్కరమని,పనిచేసే వ్యక్తులు తమ వెంట గుర్తింపు కార్డు లేదా వెరిఫికేషన్ పత్రాన్ని ఉంచుకునేలా యజమానులే చొరవ తీసుకోవాలని కోరుతోంది. పనిలో చేరిన మొదటి 30రోజుల పాటు వారి అలవాట్లు,కదలికలను నిశితంగా గమనించడం ద్వారా ఎలాంటి అనుమానాస్పద చర్యలనైనా ముందే గుర్తించవచ్చని స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా ఒంటరిగా ఉండే వృద్ధులు,తరచుగా ప్రయాణాలు చేసే కుటుంబాలు మరింత అప్రమత్తంగా ఉంటూ,ఇంట్లోని నగలు,డబ్బు,ప్రయాణ ప్రణాళికల గురించి పనిమనుషుల ముందు చర్చించకుండా జాగ్రత్త పడాలని కోరుతోంది.గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్మెంట్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సైతం తమ ప్రాంగణాల్లో ఇళ్లలో పనిచేసే పనిమనుషులకు ఎంట్రీ రిజిస్టర్లు నిర్వహిస్తూ ప్రవేశ పాస్లు ఇవ్వాలని,సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని సూచిస్తోంది. పనిమనుషుల నియామకం విషయంలో ప్రతీ ఒక్కరూ సమగ్ర వివరాలు సేకరించి పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని,మనుషుల దొంగతనాలు పెరుగుతున్న దృష్ట్యా, ముందస్తు పోలీస్ తనిఖీలు లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పనిలో చేర్చుకోవద్దు..వారి పూర్వాపరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే ఏ నిర్ణయమైనా తీసుకోవాలి."అని స్పష్టం చేశారు.

# నిజాంపేటలో బీజేపీ ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం...

ఆగస్టు 3లోపు ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి....

రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు..




**నిజాంపేట,జూలై26(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో ఎస్ఐఆర్ (సర్)ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశాన్ని మండల కన్వీనర్ పప్పుల సిద్ధరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు హాజరయ్యారు.ఈ సందర్భంగా రాగి రాములు మాట్లాడుతూ. ..నిజాంపేట మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియ 95 శాతం పూర్తైందని,ఆగస్టు 3లోపు వంద శాతం పూర్తి చేస్తామని తెలిపారు.దేశంలో కాంగ్రెస్ పాలనతో పోలిస్తే బీజేపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.నీట్ పరీక్ష అంశంలో బీజేపీ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నంలో కాంగ్రెస్, బీఆర్ఎస్,కమ్యూనిస్టు తదితర ప్రతిపక్ష పార్టీలు విద్యార్థులను తప్పుదోవ పట్టించాయని విమర్శించారు.కాంగ్రెస్ పాలనలో జరిగిన పేపర్ లీకులపై ప్రతిపక్షాలు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించిన ఆయన,బీఆర్ఎస్ పాలనలో విద్యార్థుల ఆత్మహత్యల సమయంలో ఆ పార్టీ నాయకులు కేటీఆర్,హరీష్ రావు,లు ఎందుకు స్పందించలేదని విమర్శించారు.దేశంలో శాంతి భద్రతలు,విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యతాయుతంగా వ్యవహరించారని,పార్టీ నిర్ణయాలకు బీజేపీ కట్టుబడి ఉంటుందని అన్నారు. భారతదేశాన్ని అగ్రగామి దేశంగా తీర్చిదిద్దడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్మెడ గ్రామ సర్పంచ్ చల్మేటి నరేందర్,నందిగామ సర్పంచ్ ఆకుల స్వప్నరమేష్, రాంపూర్ సర్పంచ్ పొన్నబోయిన ప్రవీణ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి,రాంపూర్ వార్డు సభ్యుడు రుద్రారం సతీష్ గౌడ్,బీజేవైఎం నిజాంపేట మండల ఇన్చార్జ్ బోయిని ప్రణయ్ కుమార్,మేకల రమేష్,అంజయ్య,రోషన్ తదితరులు పాల్గొన్నారు.

## గోల్కొండ కోటలో 80ఏళ్ల వృద్ధురాలికి తప్పని ట్రాఫిక్ ఆంక్షలు..

దాదాపు ఒక కిలోమీటర్ దూరంనడుచుకుంటూ వెళ్లాలని వృద్ధురాలు ఆవేదన..

భక్తుల ఇబ్బందులపై విమర్శలు..



**నాంపల్లి,హైదరాబాద్,జూలై26(సూర్యరేఖ)** గోల్కొండ కోట వద్ద బోనాల ఉత్సవాల సందర్భంగా అమలు చేస్తున్న ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో కొందరు భక్తులు,స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.గోల్కొండ కోటలో అన్నదానం నిర్వహిస్తున్న ఇబ్రహీంబాగ్కు చెందిన యువకులను ట్రాఫిక్ పోలీసులు సుమారు అర కిలోమీటర్ దూరంలోనే నిలిపివేసినట్లు వారు తెలిపారు.అన్నదానానికి తీసుకొచ్చిన బియ్యం సంచులను కూడా అక్కడే ఆపేయడంతో వాటిని ఎలా గమ్యస్థానానికి చేర్చాలనే అయోమయంలో నిర్వాహకులు కొంతసేపు నిరీక్షించాల్సి వచ్చిందని వాపోయారు.ట్రాఫిక్ పోలీసులను పలుమార్లు వేడుకున్న తర్వాతే తమ వాహనాన్ని ముందుకు వెళ్లేందుకు అనుమతించారని బాధితులు తెలిపారు.దీంతో అన్నదాన ఏర్పాట్లు ఆలస్యమయ్యాయని పేర్కొన్నారు. మరో వైపు సుమారు 80ఏళ్ల వృద్ధురాలిని కూడా వాహనంతో ముందుకు వెళ్లనివ్వకు ఒడా దాదాపు ఒక కిలోమీటర్ దూరంలో దింపి నడుచుకుంటూ వెళ్లాలని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు.తాను షుగర్,బీపీ వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ దూరం నడవాల్సి వచ్చిందని,వృద్ధుల పట్ల ఇలాంటి వ్యవహారం బాధాకరమని ఆ వృద్ధురాలు మీడియాతో మాట్లాడుతూ తన బాధను వ్యక్తపరిచారు. బోనాల సందర్భంగా భక్తుల రద్దీ,భద్రత,ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక ఆంక్షలు అమలు చేయడం అవసరమే అయినప్పటికీ, వృద్ధులు, దివ్యాంగులు,అనారోగ్య సమస్యలతో బాధపడుతు న్నవారు, అలాగే బోనాల సామగ్రి, అన్నదానానికి అవసరమైన వస్తువులతో వచ్చే భక్తుల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తగిన వెసులుబాటు కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతు న్నారు. మానవతా దృక్పథంతో ఇటువంటి వర్గాలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తే భక్తు లు ఇబ్బందులు పడకుండా ఉంటాయని పలువురు అధికారులకు సూచిస్తున్నారు.

# అభిమాన బంధానికి విలువిచ్చిన రజిని సాయిచంద్..

చిన్నారి 'కృతిక'కు ఆశీస్సులతో నిండిన ఆప్యాయ క్షణం.!"

వేదికలు,పదవులు,రాజకీయాలు మనుషులను కలిపేవి కావచ్చు..కానీ హృదయాలను కలిపేది ప్రేమ, అభిమానం మాత్రమే..ఒక అభిమాని ఇంటి గడప దాటి,చిన్నారి నవ్వులో ఆనందాన్ని వెతుక్కుంటూ మాజీ గిడ్డంగుల సంస్థ చైర్‌పర్సన్ రజిని సాయిచంద్ అక్కన్నపేటకు చేరుకున్న తీరు అక్కడి కుటుంబాన్ని భావోద్వేగానికి గురి చేసింది.ఆలస్యమైనా అభిమానానికి ఇచ్చిన విలువ...ఆ కుటుంబ కళ్లలో ఆనందబాష్పాలై మెరిసింది.





**రామాయంపేట,జూలై26(సూర్యరేఖ)** రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో ఆదివారం ఆప్యాయత,అభిమానం,అనుబంధానికి అద్దం పట్టే అరుదైన ఘటన చోటుచేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ,తెలంగాణ కళాకారుడు సాయిచంద్‌కు వీరాభిమాని అయిన బోడ శ్రీకాంత్(బబ్లూ)--సంధ్య దంపతులకు కుమార్తె జన్మించిన సందర్భంగా నిర్వహించిన 21వ రోజు నామకరణ మహోత్సవానికి అనివార్య కారణాలతో హాజరు కాలేకపోయిన మాజీ గిడ్డంగుల సంస్థ చైర్‌పర్సన్ రజిని సాయిచంద్..మాట నిలబెట్టుకుంటూ ప్రత్యేకంగా సమయం కేటాయించి వారి ఇంటికి విచ్చేశారు.అభిమాని ఆహ్వానాన్ని కేవలం ఆహ్వానంగా కాకుండా,కుటుంబ బంధంగా భావించిన రజిని సాయిచంద్ చిన్నారి కృతికను ఒడిలోకి తీసుకుని ప్రేమగా ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ, చిన్నారి ఆరోగ్యంగా,ఆనందంగా ఎదిగి కుటుంబానికి, సమాజానికి గర్వకారణం కావాలని ఆకాంక్షించారు. ఆమె రాకతో బోడ శ్రీకాంత్ కుటుంబం ఆనందంతో ఉప్పొంగిపోయింది. "కార్యక్రమానికి రాలేకపోయినా... మా ఇంటికే వచ్చి మా పాపను ఆశీర్వదించడం జీవితాంతం మర్చిపోలేని జ్ఞాపకం"అంటూ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు.గ్రామస్థులు కూడా రజిని సాయిచంద్ చూపిన ఆప్యాయతను అభినందిస్తూ,"పదవి ముగిసినా...మనుషుల పట్ల ప్రేమ,అభిమానుల పట్ల ఆప్యాయత మాత్రం తగ్గలేదు"అంటూ ప్రశంసలు కురిపించారు.చిన్నారి కృతిక చిరునవ్వుతో మొదలైన ఆ క్షణం...ఒక కుటుంబానికి జీవితాంతం నిలిచిపోయే తీపి జ్ఞాపకంగా మారింది. రాజకీయాలకు అతీతంగా అభిమానం,ఆప్యాయత, మానవీయ విలువలు ఎంత గొప్పవో మరోసారి అక్కన్నపేట వేదికగా చాటి చెప్పింది.

# గాలి వీస్తే 'పవర్ కట్'.!

**ఉరుములు,మెరుపుల సాకుతో గంటల తరబడి అప్రకటిత కోతలు..**

**విద్యుత్ శాఖ ముందస్తు నిర్వహణ అంతా కాగితాలకే పరిమితమా.?**

**అంధకారంలో గ్రామాలు...ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు.!**







**మసాయిపేట,జూలై26(సూర్యరేఖ)** ఆధునిక జీవన విధానంలో విద్యుత్ అనేది అత్యవసర అవసరంగా మారింది.ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకు ప్రతి చిన్న పనికీ విద్యుత్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. ప్రపంచం డిజిటల్ దిశగా వేగంగా దూసుకుపోతున్నా, క్షేత్రస్థాయిలో విద్యుత్ శాఖ అందిస్తున్న సేవల నాణ్యత మాత్రం ఇప్పటికీ పాత విధానాలకే పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆకాశంలో నల్లటి మబ్బులు కనిపించినా, స్వల్పంగా గాలి వీచినా,చిన్నపాటి ఉరుములు ,మెరుపులు వచ్చినా గ్రామాల్లో వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడం నిత్యకృత్యంగా మారింది.ఒక్కసారి కరెంటు పోతే గంటల తరబడి తిరిగి సరఫరా పునరుద్ధరణ జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**ముందస్తు నిర్వహణ పనులు కేవలం కాగితాలకేనా.?**

ప్రతి ఏడాది వర్షాకాలానికి ముందే విద్యుత్ శాఖ ప్రీ-మాన్‌సూన్ నిర్వహణ పనులు చేపట్టినట్లు అధికారులు ప్రకటిస్తుంటారు.లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం,లూజ్ వైర్లను బిగించడం, బలహీనమైన విద్యుత్ స్తంభాలను మార్చడం, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం వంటి పనులపై లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు చెబుతుంటారు.అయితే,క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది.చిన్నపాటి గాలికే లైన్లు ట్రిప్ కావడం, స్వల్ప వర్షానికే గంటల తరబడి విద్యుత్ నిలిచిపోవడం వల్ల ముందస్తు నిర్వహణ పనులు నిజంగా జరిగాయా.? లేక కేవలం రికార్డులకే పరిమితమ య్యాయా.?అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**రాత్రంతా అంధకారంలో పల్లెలు..**

చిన్నపాటి వర్షం పడినా లేదా ఉరుములు వినిపించినా గ్రామాలు రాత్రంతా చీకట్లోనే మగ్గాల్సి వస్తోంది. ఉక్క పోత,దోమల బెడదతో చిన్నారులు, వృద్ధులు ,అనారోగ్యంతో బాధపడుతు న్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్‌పై ఆధారపడే వైద్య పరికరాలు పనిచేయక కొందరు రోగులు ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. చీకటి కారణంగా పాములు, తేళ్లు వంటి విషజంతువుల భయం కూడా ప్రజలను వెంటాడుతోంది.

**ఉపాధిపై తీవ్ర ప్రభావం..**

అప్రకటిత విద్యుత్ కోతల ప్రభావం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్రంగా పడుతోంది. జిరాక్స్ కేంద్రాలు,టైలరింగ్ షాపులు,వెల్డింగ్ యూనిట్లు,రైస్ మిల్లులు,పిండి గిర్నీలు,చిన్న పరిశ్రమలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు ఉపాధి కోల్పోతూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

**తాగునీటి సరఫరాకూ అంతరాయం..**

విద్యుత్ కోతల కారణంగా గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటి పంపింగ్ నిలిచిపోతోంది.దీంతో ప్రజలకు సకాలంలో తాగునీరు అందడం లేదు. మహిళలు దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకో వాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ కూడా దెబ్బతింటోంది.

**అత్యవసర వేళల్లో అందుబాటులో లేని సిబ్బంది..**

విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో సంబంధిత సిబ్బందికి ఫోన్ చేస్తే స్పందన కరువవుతోందని వినియోగదారులు ఆరోపిస్తున్నా రు. చాలా సందర్భాల్లో ఫోన్లు స్విచ్ ఆఫ్‌లో ఉండటం లేదా స్పందించకపోవడం వల్ల సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో తెలియని పరిస్థితి నెలకొంటోంది.స్పందించినా లైన్ క్లియర్ కాలేదు, పెట్రోలింగ్ జరుగుతోంది,సిబ్బంది కొరత ఉంది,వంటి సమాధానాలతో సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

**శాశ్వత పరిష్కారాలపై దృష్టి ఎప్పుడు.?**

సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో కూడా చిన్నపాటి గాలికే విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ఆందోళన కలిగిస్తోంది.పాత వైర్లను మార్చడం,ఆధునిక ఏబీ కేబుల్స్ ఏర్పాటు చేయడం, సబ్‌స్టేషన్లను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంటే ఇలాంటి సమస్యలను చాలా వరకు నివారించవ చ్చని నిపుణులు సూచిస్తున్నారు .ప్రభుత్వాలు నిరంతరాయ విద్యుత్ సరఫరా హామీలు ఇస్తున్నప్పటికీ,గ్రామీణ ప్రాంతాల్లో అప్రకటిత విద్యుత్ కోతలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి .ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ముందస్తు నిర్వహణ పనులను పారదర్శకంగా చేపట్టడంతో పాటు,గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను ఆధునీకరించాలని ప్రజలు కోరుతున్నారు.రాత్రి వేళల్లో కూడా అత్యవసర మరమ్మతుల కోసం ప్రత్యేక బృందాల ను అందుబాటులో ఉంచి,ప్రజల ఫిర్యాదులకు వెంటనే స్పందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అప్పుడే గ్రామీణ ప్రజలకు నిరంతరాయ విద్యుత్ అందడమే కాకుండా విద్యుత్ శాఖపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు

## ఎస్.ఐ.ఆర్ ఎన్యూమరేషన్ ఫారమ్ పంపిణీ..

ఓటర్ల అవగాహన కార్యక్రమం





**సికింద్రాబాద్,జులై26(సూర్యరేఖ)** సీతాఫల్మండి రవీందర్ నగర్ కమ్యూనిటీ హాల్ నియర్ పోచమ్మ టెంపుల్ ప్రాంతంలోని బూత్ నెం., 189ఎస్.ఐ.ఆర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను ఇంటింటికీ పంపిణీ చేశారు.సంబంధిత జిహెచ్ఎంసి సూపర్వైజర్ సయ్యద్ హుస్సేన్,బి .ఎల్.ఓ శ్రీధర్, జి.వినోద్ కుమార్,ల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జి.చంద్రశేఖర్,మరిపల్లి రవి, సయ్యద్ సద్దాం,లు కలిసి పాల్గొన్నారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జి.చంద్రశేఖర్ ఓటర్లకు ఎస్.ఐ.ఆర్ ఫారమ్‌లను ప్రజలకు ఎలా సరిగ్గా పూరించాలి,ఎలా సమర్పించాలి అనే విషయాలపై అవగాహన కల్పించాను.అలాగే ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ యొక్క ప్రాముఖ్యతను వివరించి,ప్రతి ఓటరు తమ వివరాలను ఖచ్చితంగా,సరైన సమాచారంతో ఫారమ్‌లో నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జి.ఎస్.ఆర్ టీమ్ సభ్యులు,బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముషీరాబాద్ జిహెచ్ఎంసి అక్రమ నిర్మాణాలకు అధికారులే మద్దతా.?

సీజ్ చేసిన తొలగించి యదేచ్ఛగా నిర్మాణం కొనసాగింపు.?


అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం కొనసాగిన, అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?

పార్సిగుట్ట,రామ్ నగర్ లో అక్రమ నిర్మాణాలపై జోనల్ కమిషనర్ దృష్టి సారించాలి.?



**ముషీరాబాద్ సర్కిల్,జులై26(సూర్యరేఖ)** హైదరాబాద్ ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని పార్సిగుట్ట బాపూజీనగర్ ప్రాంతంలో అక్రమ బహుళ అంతస్తు నిర్మాణం,అలాగే రామ్ నగర్ ప్రధాన రహదారి ప్రక్కనే అక్రమ బహుళ అంతస్తు నిర్మాణం కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమ నిర్మాణాలు కొనసాగుతు న్నాయని,ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతుందని స్థానికులు వాపోతున్నారు.చిన్న రహదారి పక్కనే వదలాల్సిన సెట్‌బ్యాక్ నియమ నిబంధనలు పాటించకుండా నాణ్యతా ప్రమాణాలను విస్మరించి నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానకులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి నిర్మాణాల వల్ల సమీప భవనాల భద్రతతో పాటు ప్రజల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ వ్యవహారం అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ,ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.సాధారణ ప్రజలు చిన్న ఇంటి నిర్మాణానికే కఠిన నిబంధనలు అమలు చేసే అధికారులు,బహిరంగంగా జరుగుతున్న ఈ ఉల్లంఘనలపై జిహెచ్ఎంసి అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై ఆంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి,నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట పర్యవేక్షణ చేపట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# చూడముచ్చటగా'పల్లెపార్క్'.


**రూ.6లక్షలతో ఐదేళ్ల క్రితం నిర్మితం..**
**ప్రకృతి అందాలు ఒలకబోసిన సుతార్ పల్లి..**
**పర్యాటకులకు కనువిందు**

**రామాయంపేట,జులై26(సూర్యరేఖ)** అది మారుమూల పల్లె..ప్రకృతి అందాలు ఒలకపోసు కుంది.నగరాల్లో మాదిరి..అందమైన పార్క్ పర్యాటకులకు కనువిందు చేస్తోంది.ఆ పార్క్ పిల్లా,పాపలకు ఆహ్లాదం పంచుతున్నది.అదెక్కడో కాదు..రామయంపేట మండలం సుతార్ పల్లి-రాయిలాపూర్ గ్రామాల శివారులో నిర్మితమైంది. ఐదేళ్ల క్రితం పల్లె ప్రకృతి వనం పథకంలో భాగంగా వచ్చిన నిధులకు ప్రత్యేక ఫండ్ తెచ్చి అందంగా తీర్చిదిద్దారు.చుట్టూ పచ్చని పంట పొలాలు,అందంగా అలంకరించుకున్న చెరువు ప్రక్కనే ఏర్పాటు చేశారు.దీంతో అటువైపు గా వెళ్లే ప్రయాణికులకు సైతం ఈ పార్క్ ఆహ్లాదాన్ని ఆస్వాదిస్తున్నారు.ఇక సెలవు దినాల్లో చుట్టుపక్కల ప్రాంతాల వాసులు పిల్లలను తీసుకొని పార్కులో గడుపుతున్నారు.

**ఆట వస్తువులు అందంగా..**

పార్క్ స్థలంలో పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేశారు.దీనివల్ల అక్కడికి వెళ్లేందుకు చిన్నారులు ఆసక్తి పెంచుకుంటున్నారు.బడులు లేని రోజున పార్కు చేరుకొని ప్రకృతి అందాల్లో మునిగితేలు తున్నారు.

**మరింత మెరుగుపరుస్తా..**
**సర్పంచ్ సునీల్**

వివిధ గ్రామాల ఆనుకొని ఉన్న సుతార్ పల్లి పార్క్ ను మరింతగా అభివృద్ధి చేస్తానని గ్రామ సర్పంచ్ సునీల్ పేర్కొన్నారు.ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సహకారంతో పార్క్ లో ఆట పరికరాలు పెంచుతామన్నారు.

# అమర సైనికుల త్యాగాలు ఎప్పటికీ మరువలేం

**కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఘన నివాళి**
**దేశ ఐక్యతను చాటేందుకు యువత ముందుకు రావాలి**
**-అజ్మీరా సీతారాం నాయక్**






**మరిపెడ,జులై26(సూర్యరేఖ):** దేశ సరిహద్దుల్లో అహర్నిశలు ప్రాణాలను పణంగా పెట్టి దేశ సార్వభౌమత్వాన్ని కాపాడిన అమర సైనికుల త్యాగాలను భారత జాతి ఎన్నటికీ మరువదని మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు.మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని కార్గిల్ అమరవీరుల స్థూపం వద్ద కార్గిల్ సోల్జర్స్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్,మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కాలం సునీత రవీందర్‌రెడ్డి,కాంగ్రెస్ జిల్లా యువనేత నూకల అభినవ్‌రెడ్డి,సీఐ పవన్‌కుమార్,ఎస్ఐ గంద్రాతి సతీష్,మాజీ సర్పంచ్ పానుగోత్ రాంలాల్,బీజేపీ జిల్లా నాయకులు గుగులోత్ శంకర్ నాయక్ తదితరులు అమరవీరుల స్థూపానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.ఈ సందర్భంగా అజ్మీరా సీతారాం నాయక్ మాట్లాడుతూ..1999 కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు ప్రదర్శించిన అసాధారణ ధైర్యసాహసాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా శత్రువులను తిప్పికొట్టి దేశ గౌరవాన్ని నిలబెట్టారని కొనియాడారు.కార్గిల్ విజయం అమర సైనికుల ప్రాణత్యాగాల ఫలితమేనని,వారి త్యాగాల వల్లే దేశ ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని పేర్కొన్నారు.దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనే కుట్రలను ప్రతి భారతీయుడు ఐక్యంగా తిప్పికొట్టాలని,దేశభక్తిని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత కార్గిల్ అమరవీరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకొని దేశ సేవకు అంకితభావంతో ముందుకు రావాలని సూచించారు.మరిపెడ సీఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ,దేశ రక్షణ కోసం విపత్కర పరిస్థితుల్లోనూ విధులు నిర్వర్తిస్తూ ప్రాణత్యాగం చేసిన అమర సైనికుల సేవలు మరువలేనివని అన్నారు.సరిహద్దుల్లో సైనికులు అప్రమత్తంగా ఉండటమే దేశ ప్రజలు ప్రశాంతంగా జీవించడానికి కారణమని పేర్కొన్నారు.కార్గిల్ సోల్జర్స్ మెమోరియల్ సొసైటీ చైర్మన్ గాదె రాంబాబు మాట్లాడుతూ,దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన ప్రతి సైనికుడికి యావత్ భారతదేశం శిరస్సు వంచి నివాళులర్పిస్తుందని అన్నారు.కార్గిల్ యుద్ధ వీరుల త్యాగాలు,ధైర్యసాహసాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహిస్తూ అమరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్గిల్ సోల్జర్స్ మెమోరియల్ సొసైటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గాదె లోహిరెడ్డి,నాయకులు మెంచు అశోక్‌కుమార్,అప్సర్,దేవరశెట్టి లక్ష్మీనారాయణ, బోడ రవి,మేకల కృష్ణయ్య,భూక్యా సుధాకర్ నాయక్, భూక్యా కాంతమ్మ,పులి శ్రీనివాస్, నాగరాజు, సాగర్‌తో పాటు సెయింట్ అగస్టీన్,జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది.

## దేవేందర్ నగర్ కాలనీలో రౌడీ మూకల ఆట కట్టించాలి..

**మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముట్టడికి పిలుపునిచ్చిన అఖిలపక్షం సభ్యులు**



**బోడుప్పల్,జూలై26(సూర్యరేఖ)** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీలో గత కొంతకాలంగా జరుగుతున్న దాడులు,గొడవలు నేపథ్యంలో కాలనీలో ప్రశాంత వాతావరణం నెలకొనాలని లక్ష్యంతో గత నెలలో గృహప్రవేశం జరుగుతున్న ఇంటి సభ్యుల పైన,అలాగే స్థానిక రిపోర్టర్ విష్ణుగౌడ్ ఇంటిపై రౌడీ గ్యాంగులు,గాంజా మూకలు రాళ్ల దాడి,కారు బైకుల ధ్వంసం ఘటనలో నిందితులపై బాధితులు మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ దాడికి ప్రధాన కారకులైన వ్యక్తులను కాకుండా ఇతర వ్యక్తులను అరెస్ట్ చేసి చేతులు దులుపుకున్నారని,తక్షణమే గొడవకు కారణమైన జెన్నరాజు,జెన్ననాగరాజు,సానిక ప్రశాంతు,హరీష్ అతని అనుచరులందరినీ తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ దేవేందర్ నగర్ కాలనీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో బిజెపి,బిఆర్ఎస్,కాంగ్రెస్, సిపిఐ,జనసేన,మొదలైన పార్టీ నాయకులు పాల్గొని బాధితులను,కాలనీవాసులను సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ... పార్టీలకతీతంగా ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎవరినైనా క్షమించరాదని,దేవేందర్ నగర్ కాలనీలో గొడవలకు ప్రధాన కారకుడుగా భావిస్తున్న జెన్నరాజు,జెన్న నాగరాజు,సానిక ప్రశాంతు,హరీష్ ,స్థానిక యువకులకు మత్తు పదార్థాలను అలవాటు చేసి ఆయన అవసరాల కోసం పలు గోడవలలో వారిని వాడుకుంటున్నారని,చాలామంది యువత మద్యం గంజాయి వంటి మతపదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని,పలువురు బాధితులు లబోదిబోమన్నారు.ఈ సంఘటనలోని ప్రధాన నిందితులను అరెస్ట్ చేసే వరకు అఖిలపక్షం సభ్యులందరూ కాలనీవాసులకు అండగా ఉంటామని తెలుపుతూ సోమవారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముట్టడికి పిలుపునిచ్చారు.ఈ అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు రాములు,మేడ్చల్ జిల్లా బిబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,మాజీ కార్పొరేటర్,బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్,బోడుప్పల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ,మాజీ కార్పొరేటర్ చీరాల నరసింహ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు దానగల్ల యాదగిరి,జక్క రాములు,టిఆర్ఎస్ నాయకులు శ్రీధర్ గౌడ్,మేడ్చల్ జిల్లా బిజెపి నాయకులు జెనీగ వెంకటేష్,మేడిపల్లి మండల సిపిఐ పార్టీ అధ్యక్షులు రచ్చకిషన్,జనసేన పార్టీ నాయకుడు సాయికుమార్,దేవేందర్ నగర్ కాలనీ అధ్యక్షుడు దయ్యాల మహేష్,జనరల్ సెక్రటరీ తాటికాయల యాదగిరి,అంబేద్కర్ నగర్ అధ్యక్ష దేశపాక నరసింహ,నాయకులు ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి,గడ్డం యాదగిరి,దండు రమేష్, బాలస్వామి,పంగ రమేష్, భగవంతు, సదానంద్,కాలనీ కమిటీ సభ్యులు పండుగ యాకయ్య, అఫ్జల్,వెంకటేష్,మారపాక మధు, ఆరోగ్యం,మహిళలు నర్సమ్మ,పద్మ, జంగమ్మ, లావణ్య,శ్రీలత,రేణుక,అంజమ్మ,ఉప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేస్తే కఠిన చర్యలు

**విద్వేషపూరిత పోస్టులు,దుష్ప్రచారంపై ప్రత్యేక నిఘా**
**-జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**




**నారాయణపేట,జులై26(సూర్యరేఖ):** సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు,దుష్ప్రచారం,ఇతరుల మనోభావాలను దెబ్బతీసే పోస్టులు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్,ఐపీఎస్ హెచ్చరించారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..రానున్న పండుగల సందర్భంగా కుల,మత,ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు ,వీడియోలు,ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు.ఇలాంటి చర్యలు జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నందున పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఫేస్‌బుక్,ఎక్స్,ఇన్‌స్టాగ్రామ్,వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఒక వర్గాన్ని కించపరిచే పోస్టులు చేయడం,తెలియని వీడియోలు లేదా ఫొటోలను ధృవీకరించకుండా షేర్ చేయడం,ఫార్వర్డ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులతో పాటు గ్రూప్ అడ్మిన్‌పైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.సామాజిక మాధ్యమాలను మంచి పనుల కోసం మాత్రమే వినియోగించాలని,తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.జిల్లాలో ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై పోలీసులు 24 గంటలూ నిఘా ఉంచుతున్నారని,చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.సామాజిక మాధ్యమాల్లో ఏదైనా పోస్టు చేయడానికి లేదా ఫార్వర్డ్ చేయడానికి ముందు దాని నిజానిజాలు నిర్ధారించుకోవాలని,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సూచించారు.

## వివాహితపై దాడి చేసి హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్..రిమాండ్‌కు తరలింపు



**మరిపెడ,జూలై26(సూర్యరేఖ)**మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణంలోని శాంతి థియేటర్ వీధిలో వివాహితపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడిని మరిపెడ పోలీసులు అరెస్ట్ చేశారు.మరిపెడ ఎస్‌హెచ్ఓ గంద్రాతి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ ఏడాది జూన్ 7న తిరుమలాయపాలెం మండలం మేకల తండా గ్రామానికి చెందిన వివాహితపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన జిన్నా యాకయ్య అలియాస్ మున్నాను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్ తరలించినట్లు ఎస్‌హెచ్ఓ సతీష్ తెలిపారు.

## ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలి

**-రాము ముదిరాజ్**



**రాజేంద్రనగర్,జులై26(సూర్యరేఖ):**తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీల అమలుపై ప్రధానంగా దృష్టి సారించాలని సామాజిక కార్యకర్త రాము ముదిరాజ్ కోరారు.ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనవసర జాతీయ రాజకీయ అంశాల్లో జోక్యం చేసుకోవడం కంటే రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు,బీసీలకు ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా విద్యార్థుల ఉద్యమ ఫలితమేనని,దానికి రాష్ట్ర ప్రభుత్వం లేదా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సంబంధం లేదని రాము ముదిరాజ్ అభిప్రాయపడ్డారు.ఆ అంశాన్ని రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవడం సమంజసం కాదని పేర్కొన్నా రు.రాష్ట్ర ప్రతిష్ఠకు భంగం కలిగించే వ్యాఖ్యలు,చర్యలకు దూరంగా ఉండాలని సూచించిన ఆయన,ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలు,ఎన్నికల హామీల అమలుపైనే దృష్టి కేంద్రీకరిం చాలని కోరారు.

# చేనేత సహకార సంఘాల్లో భారీ అవకతవకలు జరిగాయి

సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

-అఖిలపక్ష నాయకులు



**నారాయణపేట,జులై26(సూర్యరేఖ):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని పలు చేనేత సహకార సంఘాల్లో భారీ అవకతవకలు జరిగాయని అఖిలపక్ష నాయకులు ఆరోపించారు.ఆదివారం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో వారు ఈ ఆరోపణలు చేశారు.చేనేత సహకార సంఘాల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండమీది బలరాం,సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పట్టణ కార్యదర్శి కెంచి నారాయణ,తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ కార్యదర్శి రాములు యాదవ్ మాట్లాడుతూ..డీసీఓ ఆడిట్ నివేదికల ప్రకారం హెచ్‌డబ్ల్యూసీఎస్,గాంధీనగర్,లక్ష్మీ సిల్క్స్,సరాఫ్‌బజార్,చిన్నజాత్రం చేనేత సహకార సంఘాల్లో సుమారు రూ.51 కోట్ల మేర అక్రమ లావాదేవీలు జరిగినట్లు ఆరోపించారు.సంబంధిత అధికారులు,సొసైటీల పాలకవర్గాలు కుమ్మక్కై ఈ అవకతవకలకు పాల్పడ్డారని విమర్శించారు.గత రెండు దశాబ్దాలుగా చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడంలో నిర్లక్ష్యం జరిగిందని,దీంతో కార్మికులు అప్పుల పాలై వలసలు వెళ్లడంతో పాటు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మరణించిన సభ్యుల వారసులకు సభ్యత్వం ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు.చేనేత మగ్గాలకు జియో ట్యాగింగ్ ఉన్నప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి పవర్‌లూమ్ వస్త్రాలను కొనుగోలు చేసి స్థానిక చేనేత కార్మికులు తయారు చేసినట్లుగా చూపించి టెస్కోకు విక్రయించారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ సంబంధిత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం సమంజసం కాదన్నారు.గాంధీనగర్ చేనేత కార్మికుల ఇళ్లకు యాజమాన్య హక్కులు కల్పించాలని,అర్హులైన చేనేత కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని,చేనేత కార్మికులకు ప్రత్యేక పెన్షన్‌ను రూ.4 వేల వరకు పెంచాలని కోరారు.చేనేత చేయూత బీమా పథకంలో అక్రమాలను అరికట్టి,సహజ మరణం చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన సాయాన్ని పారదర్శకంగా అందించాలని విజ్ఞప్తి చేశారు.చేనేత సహకార సంఘాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలు,అవినీతిపై సోమవారం జిల్లా కలెక్టర్‌కు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయనున్నట్లు నాయకులు తెలిపారు.ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రాఘవనాయుడు,కాంగ్రెస్ నాయకులు తుల్జారాం,సీపీఎం పట్టణ కార్యదర్శి కే.కాశప్ప,సోషల్ మీడియా కన్వీనర్ సోఫీ మజా హుస్సేన్,సీపీఎం నాయకులు నరహరి,చేనేత కార్మికులు నారాయణ,నాగేందర్,శ్రీకాంత్,వెంకటేష్,దొడ్డి లక్ష్మణ్,వీరన్నతో పాటు పలువురు నాయకులు,చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## ఉత్తర తెలంగాణ అభివృద్ధికి గేమ్‌చేంజర్

-మొదటిపేజీ తరువాయి

400 ఎకరాలు సివిల్ ఏవియేషన్ ఎన్‌క్లేవ్, ఎంఆర్‌ఓ, కార్గో టెర్మినల్, హ్యాంగర్లు, భవిష్యత్ విస్తరణ అవసరాల కోసం కేటాయించనున్నట్లు తెలిపారు.

**అనుబంధ పనులకూ నిధులు**

భూసేకరణతో పాటు ఇప్పటికే ఉన్న రహదారుల మళ్లింపు, 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ల తరలింపు, వాగుల మళ్లింపు, మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ల మార్పు, విద్యుత్ స్తంభాల తొలగింపు వంటి అన్ని అనుబంధ పనులకు అవసరమైన నిధులను కూడా ఈ పరిపాలనా అనుమతిలో భాగంగా కేటాయించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వివరించారు.

**అనేక రంగాలకు విశేష ఊతం**

ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ రాష్ట్రానికి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. భారత వైమానిక దళం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా అభివృద్ధి చేయనున్న ఈ ఎయిర్‌ఫీల్డ్ వల్ల ఉత్తర తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, కార్గో రవాణా, పర్యాటకం, రక్షణ రంగాలకు విశేష ఊతం లభిస్తుందన్నారు. దీనితో పాటు వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.

**డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో నిరంతర సమన్వయం ఫలితంగానే ఈ ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ వ్యయంతో పాటు అన్ని అడ్డంకుల తొలగింపు ఖర్చును కూడా భరిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూసేకరణతో పాటు రహదారులు, విద్యుత్ లైన్లు, ఇతర మౌలిక వసతుల మార్పిడి పనులను ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించామన్నారు.

## ఫారాలు తిరిగిస్తేనే ఓటు

-మొదటిపేజీ తరువాయి



ఫారాలను తిరిగి సమర్పించకపోవడంతో గందరగోళం నెలకొంది. ఇలాంటి వారి కారణంగా నమోదుశాతం పడిపోయే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఒక్కో ఇంటికి మూడుసార్లు వెళ్తూ**

సర్ ఎన్యూమరేషన్ పత్రం తిరిగివ్వనివారు, ఇప్పటి వరకు తీసుకోని ఓటర్లు ఉన్నట్లయితే ఒక్కో ఇంటికి మూడు సార్లు వెళ్లాలని ఈసీ (ఎన్నికల సంఘం) అధికారులకు నిర్దేశించింది. ఈ మేరకు ఓటర్ల నుంచి ఫారాలు తీసుకోవడం, నింపిన పత్రాల డిజిటలైజేషన్? ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు. దీనివల్ల బీఎల్?వోలు ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వని వారి ఇంటి వద్దకు వెళ్లి మాట్లాడుతున్నారు. విలీన గ్రామాల్లో డప్పు ద్వారా చాటింపు చేస్తున్నారు. అందుబాటులో లేని ఇంటి ఓనర్లను ఫోన్?లో సంప్రదిస్తున్నారు. కొంతమంది సమయం ఉంది కదా! అని దాటవేస్తుండగా, మరికొందరి ఫోన్లు పని చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పక్కింటి వారితో మాట్లాడి స్థానికంగా ఉండటం లేదని వివరాలు నమోదు చేసుకుంటున్నట్లుగా సమాచారం.

**నగరమా, గ్రామమా**

నగరంలో నివసిస్తున్న వారిలో కొంతమందికి గ్రామాల్లోనూ ఓట్లున్నాయి. అక్కడే ఉంచుకోవాలా ఇక్కడ కొనసాగించాలా అనే మీమాంసలో ఉన్నారు. గ్రామాల్లో భూములున్నవారు అక్కడి జాబితాల్లోనే పేర్లు ఉంచేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. వీరందరికీ నగరంలో ఎన్యూమరేషన్ ఫారాలు అందించగా తిరిగి అప్పగించాలని కోరుతున్నప్పటికీ పట్టించుకోవట్లేదు. సంబంధిత బీఎల్‌వోలకు (బూత్ లెవల్ అధికారులు) అప్పగించి ఎక్కడ నమోదు చేసుకున్నారో చెబితే ఆ విషయాన్ని 'సర్'లో నమోదు చేస్తామని పేర్కొంటున్నారు. బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వో) ఇచ్చిన ఎన్యుమరేషన్ ఫారాల్లో వివరాలు నింపేందుకు ఏవైనా సమస్యలున్నట్లయితే కేవలం మూడో కాలమ్‌లో పేరు, ప్రస్తుత అడ్రస్‌ను రాసి ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు. తర్వాత ఏదైనా ఐడీ కార్డుతో నోటీసుకు బదులివ్వడం ద్వారా ఓటు హక్కును ఇక్కడే ఉంచుకునే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. వివరాలను నింపలేక ఎన్యూమరేషన్ ఫారాన్ని ఇంట్లోనే ఉంచుకుంటే మాత్రం ఓటు కచ్చితంగా రద్దవుతుందనే విషయాన్ని అధికారులు గుర్తుచేస్తున్నారు. ఓటరు నమోదు పత్రాలు నింపేందుకు జీహెచ్?ఎంసీ కేంద్ర కార్యాలయంతో పాటు సర్కిల్ ఆఫీసుల్లో హెల్ప్?లైట్ సెంటర్లు విస్తృతంగా పనిచేస్తున్నాయి.

## సంచార జాతులలోని కొన్ని కులాలకు ఇటీవాలా కుల పేరు మార్పిడి

విషయంలో కొన్ని కులాలూ పేరు మార్పిడి విషయామై ప్రభుత్వాన్ని మొరపెట్టుకోగ ఇటీవల సంచారాజాతులలోని బుడబుక్కల కులం వారికీ వారి కులం స్థితి గతులని గమనించి వారికీప్రభుత్వం శివ క్షత్రియ పేరుని నియమించడం జరిగింది.



**శేరిలింగంపల్లి,జులై26(సూర్యరేఖ)** కావున బుడబుక్కల కులం వ్యవస్థాపకులు చంద్రశేఖర్,ఉపఅధ్యక్షులు సురేష్,మధుసూదన్, జగదీశ్వర్ అలాగే కులం సభ్యులు నరసింహ,దశరథ్ బాలకృష్ణ,శ్రీకాంత్ తులసిరం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేస్తూ వారి సంతోషాన్ని వ్యక్తపరిచారు.అలాగే వారి కులం యొక్క భవిష్యత్తు కార్యచరణకై కులం పెద్ద మనుషుల సమక్షంలో చర్చిచుకోవడం జరిగింది.అలాగే ప్రస్తుత ప్రభుత్వానికి వారి కులానికి ఒక కులం కమ్యూనిటీహాల్ లింగంపల్లిలో సమాకూర్చాలని విన్నవించుకోవడం జరిగింది.

## నత్తనడకన రేషన్ కార్డుల ఈ-కేవైసీ

-మొదటిపేజీ తరువాయి



చిన్నారులు, 8 సంవత్సరాల పిల్లలకు కూడా కేవైసీ చేయించాల్సిన అవసరం లేదు. అయితే ఈ పిల్లల్లో వేలిముద్రలు, ఐరిస్ వస్తే డీలర్ వద్ద నమోదు చేయిస్తే సరిపోతుంది. ఎనిమిదేళ్ల కంటే ఎక్కువ వయసున్న పిల్లలు మాత్రం తప్పకుండా ఈ-కేవైసీ పూర్తి చేయాలని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ చేసుకోకపోతే బియ్యం కోటా తగ్గడం లేదా ఏవైనా ఆంక్షలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**బయోమెట్రిక్ అప్‌డేట్ చేయాలి**

ఇప్పటివరకు ఉన్న లబ్ధిదారుల్లో కొంతమందికి వేలిముద్రలు రావటం లేదు. ఇలాంటి వారు బయోమెట్రిక్ వివరాలను తప్పకుండా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. దగ్గర్లోని ఆధార్? కేంద్రానికి వెళ్లి ఈ ప్రక్రియను పూర్తి చేయాలి. దీంతో రెండు రోజుల్లో బయోమెట్రిక్? పూర్తవుతోంది. అయితే కొందరికి వేలి ముద్రలు అసలే ఉండవు. అలాంటివారు ఐరిస్? ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఉన్నత విద్య కోసం కొంతమంది ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటారు. అలాంటి లబ్ధిదారులు స్థానికంగా ఉన్న రేషన్ దుకాణాల్లో ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు. వన్ నేషన్- వన్ రేషన్ ప్రక్రియ ద్వారా ఈ ప్రక్రియను సులభంగా పూర్తిచేయవచ్చు. కొన్ని జిల్లాల్లో కేవలం ఈ-కేవైసీ కోసమే రేషన్? దుకాణాలు తెరుచుకుంటున్నాయి. చివరి తేదీ వరకు వేచి చూడొద్దని, సర్వర్? బిజీ వచ్చే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

**చనిపోయిన వారు ఉన్నారా**

కొన్ని జిల్లాల్లో ఈ-కేవైసీ ప్రక్రియలో పెరుగుదల లేకపోవడంతో, మరణించిన వారు ఉన్నాయోమో అనే అనుమానం వ్యక్తమవుతోంది. వారందరి పేర్లు తొలగించనున్నారు.

## కుషాయిగూడలో దళిత మహిళా జర్నలిస్టుపై దూషణ..

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు..

విధి నిర్వహణలో పన్నీరు విక్రయాలపై ఆరా తీసిన జర్నలిస్టుపై అసభ్య పదజాలంతో దూషించారన్న ఫిర్యాదు..

దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.



**కుషాయిగూడ,జూలై26(సూర్యరేఖ)** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దళిత మహిళా జర్నలిస్టుపై కుల దూషణలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ,ఎస్టీ (అత్యాచారాల నిరోధక)చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఫిర్యాదుదారు బి.వాణి (40),భర్త స్వామి,మాదిగ సామాజిక వర్గానికి చెందిన జర్నలిస్టు,నాచారం ఇంద్రానగర్ కాలనీ రోడ్ నెం.6 నివాసి.ఈనెల 16న కుషాయిగూడలోని మురళీకృష్ణ మిల్క్ పార్లర్‌లో కల్తీ పన్నీరు విక్రయిస్తున్నారనే సమాచారం అందడంతో విధి నిర్వహణలో భాగంగా మధ్యాహ్నం సుమారు 2:30 గంటలకు కస్టమర్‌గా వెళ్లి పన్నీరు కొనుగోలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అనంతరం పన్నీరు నాణ్యతపై షాపు యజమానిని ప్రశ్నించగా,తనకు తెలిసిన ఎంపల్లి పద్మారెడ్డి(రిపోర్టర్, శివసాయినగర్, కుషాయిగూడ) తో ఫోన్‌లో మాట్లాడాలని చెప్పినట్లు తెలిపారు.ఫోన్ సంభాషణలో తాను దళిత మహిళా జర్నలిస్టునని తెలిసినప్పటికీ పద్మారెడ్డి అసభ్య పదజాలంతో దూషించారని ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కుషాయిగూడ పోలీసులు ఎస్సీ, ఎస్టీ(అత్యాచారాల నిరోధక)చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు..

టి.ఆర్.ఎస్.బాపు మల్ శెట్టి



**నారాయణఖేడ్, జులై27(సూర్యరేఖ)**ఆషాఢ మాస బోనాల ఉత్సవంలో నారాయణఖేడ్ నియోజకవర్గ టి.ఆర్.ఎస్.పార్టీ ఇంచార్జ్ బాపు మల్ శెట్టి పాల్గొన్నారు. నారాయ ణఖేడ్ మున్సిపా లిటీ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలోని శ్రీశ్రీశ్రీ మైసమ్మ అమ్మవారి ఆలయంలోలి నిర్వహించిన ఆషాఢ మాస బోనాల మహోత్సవంలో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో,ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు.రైతులు పండించిన పంటలు బాగా పండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని కోరారు.ఈ కార్యక్రమంలో టి.ఆర్.ఎస్. నాయకులు భీమయ్య ముదిరాజ్, ప్రశాంత్ ముదిరాజ్,పండరి ముదిరాజ్,మహేష్ చౌహాన్ కౌన్సిలర్,చందు, నాగరాజ్, శివరాజ్, యాదయ్య,సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తున్న కార్పోరేటర్ కు ధన్యవాదాలు..

కనకలక్ష్మి



**శేరిలింగంపల్లి,జూలై26(సూర్యరేఖ)** శేరిలింగంపల్లి డివిజన్ లోని పాపిరెడ్డికాలనీ,రాజీవ్ గృహకల్పలో ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా పలు చర్చిలను సందర్శించిన కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి పాపిరెడ్డి కాలనీలోని సీనియర్ మహిళా నాయకురాలైన కే.కనకలక్ష్మి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కే.కనకలక్ష్మి మాట్లాడుతూ. ..కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు నమోదు కార్యక్రమాలలో బాగంగా పలు చర్చిలను సందర్శించి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికి వివరించటం అభినందనీయమని కొనియాడారు.



# ఎప్పటికైనా రాజమౌళి, సుకుమార్ దర్శకత్వంలో నటిస్తే చాలు

మాస్‌రాజా రవితేజ హీరోగా నటించిన మిస్టర్ బచ్చన్ చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలోకి హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే అడుగుపెట్టింది. మొదటి సినిమా ఫ్లాప్ అయినా తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా భాగ్యశ్రీ, అఖిల్‌తో కలిసి నటించిన లెనిన్ సినిమా ఆమె కెరీర్‌కు మలుపు తిప్పింది. తాజాగా ఈ బ్యూటీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన కెరీర్‌పై ప్రత్యేకమైన కలలు ఏమీ పెట్టుకోలేదని స్పష్టం చేసింది. నాకు ఎలాంటి డ్రీమ్ రోల్స్ లేవు.. ఫ్లోలో వెళ్లిపోవడమే. టార్గెట్లు లాంటివి పెట్టుకుంటే టెన్షన్ వస్తుంది. చిన్న చిన్న టైమ్ లైన్స్ పెట్టుకొని ముందుకు సాగితే మనసుకు చాలా హాయిగా ఉంటుందని ఆమె చెప్పింది.తెలుగు ఇండస్ట్రీలోనే సెటిల్ అవ్వాలని నిర్ణయించుకున్న భాగ్యశ్రీ, తన చివరి చిత్రం కూడా తెలుగులోనే చేస్తానని ఇప్పటికే తెలిపింది. అలా ఈ గ్యాప్‌లో రాజమౌళి, సుకుమార్ దర్శకత్వంలో నటిస్తేచాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రస్తుతం భాగ్యశ్రీ తెలుగు నేర్చుకుంటోంది. అంతేకాదు తెలుగు సంస్కృతికి కూడా అలవాటు పడుతోంది. ఉదయం అల్పాహారం నుంచి డిన్నర్ వరకు అన్నింటిలో తెలుగు వంటకాలను ఇష్టపడుతోంది. బ్రేక్‌ఫాస్ట్‌లో ఇడ్లీ, దోశ, ఊతప్పం, ఉప్మా వంటి వంటకాలు తన ఫేవరెట్ లిస్ట్‌లో ఉన్నాయని వెల్లడించింది.

ఇక తనకు ప్రత్యేకంగా ఏ నగరంలో సెటిల్ అవ్వాలని లేదని, కానీ హిల్ స్టేషన్లు అంటే చాలా ఇష్టమని తెలిపింది. బీచ్‌ల కంటే కొండ ప్రాంతంలో ఉండడమే తనకు హాయిగా అనిపిస్తుందని చెప్పింది. ఇటీవల తన సంపాదనతో తల్లికి మొబైల్ ఫోన్ కొనిచ్చిందని తెలిపింది. తనది మధ్యతరగతి కుటుంబమని.. కానీ తల్లిదండ్రుల కోసం ఎంత ఖర్చు పెట్టినా తప్పులేదని ఆమె భావోద్వేగంగా చెప్పింది.




# ఎన్టీఆర్ డ్రాగన్.. మరో స్టార్ నటుడి ఎంట్రీ..!

జూనియర్ ఎన్టీఆర్– ప్రశాంత్ నీల్ కాంబోలో ఓ పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ రాబోతోంది. ఈ మూవీకి డ్రాగన్ అనే టైటిల్ పెట్టనున్నారని ప్రచారం జరుగుతోంది. కేజీఎఫ్ తర్వాత నీల్ తెరకెక్కిస్తోన్న మూవీ కావడంతో టాలీవుడ్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే డ్రాగన్‌కు సంబంధించిన ఓ క్రేజీ టాక్ వైరలవుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటుడు మనోజ్ భాజ్‌పేయి నటించనున్నారని లేటేస్ట్ బజ్ వినిపిస్తోంది. ఇప్పటికే అతన్ని మేకర్స్ సంప్రదించారని టాక్. ఓ కీలక పాత్ర కోసం మనోజ్‌ను చిత్ర యూనిట్ అడిగినట్లు తెలుస్తోంది. ఓకే అయితే వచ్చే షూటింగ్ షెడ్యూల్‌లోనే మనోజ్ ఎంట్రీ ఇస్తాడని సమాచారం. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రంలో కాంతార బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా కనిపించనుంది. కాగా.. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ మూవీకి నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ యేర్నెని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది థియేటర్లలో సందడి చేయనుంది.

# అగధ ప్రచార జాతర

దర్శక,నిర్మాత ఎంఎస్ రాజు రూపొందించిన డివైన్ మిస్టిక్ థ్రిల్లర్ ‘అగధ’. కాశీ విశాలాక్షి బలుసు నిర్మించారు. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్‌రెడ్డి ప్రధానపాత్రధారులు. ఆగస్ట్ 14న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా తెలంగాణలోని చారిత్రక, ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం బల్కంపేట ఎల్లమ్మ–పోచమ్మ దేవాలయంలో అమ్మవార్ల దివ్య ఆశీస్సులతో ఈ చిత్ర ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ‘కొంతమేర అమ్మవారిపై ఆధారపడ్డ కథ ఇది. అనుకోకుండా బల్కంపేట అమ్మవార్ల ఆశీస్సులతో ప్రచారం మొదలవ్వడం ఆనందంగా ఉంది. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించాం. గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం. త్వరలోనే ట్రైలర్ రానుంది’ అని ఎంఎస్‌రాజు తెలిపారు. ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా రాలేదు. ఈ తరహా కథలకు ఇదో ట్రెండ్ సెట్టర్ అవుతుంది. ఎంఎస్‌రాజు నిర్మించిన ‘దేవి’ సంచలన విజయం సాధించింది. ‘అగధ’ విషయంలో మళ్లీ ఆ చరిత్ర రిపీట్ కానుంది’ అని నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు నమ్మకం వెలిబుచ్చారు. కథానాయిక కామాక్షి భాస్కర్ల ప్రత్యేకంగా అలంకరించుకొని భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. చిత్ర సమర్పకులు అజయ్ కేఆర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎన్వీఎన్‌లతోపాటు నటులు సుబ్బరాజు, హీరో శ్రవణ్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.




# పారితోషికంగా 20కోట్లు?

ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలోని టాప్ 5 హీరోయిన్లలో సాయిపల్లవి కచ్చితంగా ఉంటారు. ఇప్పటివరకూ సాయిపల్లవి రిజక్ట్ చేసిన సినిమాలు ఉన్నాయి గానీ, సాయిపల్లవిని రిజక్ట్ చేసిన సినిమాలు లేవు. దటీజ్ సాయిపల్లవి. ఆమెను మెప్పించాలంటే ముందు మంచి కథతో వెళ్లాలనేది దేశవ్యాప్తంగా ఉన్న దర్శకనిర్మాతల మాట. కథకు, పాత్రకూ తొలిప్రాధాన్యతనిచ్చే సాయిపల్లవి.. అసలు పారితోషికం ఎంత తీసుకుంటుంది? అనేది మాత్రం చాలామందికి తెలీదు. కానీ ప్రస్తుతం బీటౌన్ సమాచారం ప్రకారం నితేష్ తివారీ దర్శకత్వంలో ఆమె నటిస్తున్న ‘రామాయణ’ చిత్రానికి రెండు భాగాలకు గాను రూ.20 కోట్లను ఆమె రెమ్యునరేషన్‌గా అందుకుంటున్నదని తెలిసింది. అంటే సినిమా పదికోట్లన్నమాట. ఈ స్థాయి పారితోషికం అందుకునే తారలు ఇండియాలో అరుదు.



Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713